ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY


విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్:
9440897445, 8074636674

మంగళవారం 11 ఆగస్టు 2026 | సంపుటి: 28 సంచిక: 124
Tuesday 11 August 2026 | Vol.No 28 Issue No .124
హైదరాబాద్ Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

**కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు**



### హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

**ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు**

న్యూఢిల్లీ,ఆగస్ట్10 :దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం మిగతా2లో..

## సాగర్‌లో ముగిసిన వరుణయాగం



- పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు
- వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు

నాగార్జునసాగర్,ఆగస్ట్10 : రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ వేదికగా 'మహా వరుణ మిగతా2లో..



## ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

- ఎక్కడా కార్యాలయ భవనాల నిర్మాణమేదీ
- భూభారతితో రైతులకు భరోసా కల్పించిన ప్రజాప్రభుత్వం
- గత బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ పొంగులేటి
- హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం

హనుమకొండ,ఆగస్ట్10 :రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు.




రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మిగతా2లో..

## కేంద్రం మరోమారు తెలంగాణకు మొండిచేయి

- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం
- రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం



న్యూఢిల్లీ,ఆగస్ట్10 :కేంద్రంలోని మోడీ సర్కార్ తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపింది. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పింది. ఆ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని తేల్చిచెప్పింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని.. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు ట్రెబ్యునల్ పరిధిలో ఉందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలంటూ మిగతా2లో..

## అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

- అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు
- హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ,ఆగస్ట్10 : పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన మిగతా2లో..

## గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి

- 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం లక్ష్యం
- అమెరికా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి

మిగతా2లో..




## బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు



- రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది
- స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న
- సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్10 : తెలంగాణలో బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ, చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న మిగతా2లో..

## మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్

- నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకుని హైడ్రా
- మీడియాతో చిట్‌చాట్‌లో రాంచంద్రరావు విమర్శలు



హైదరాబాద్,ఆగస్ట్10 : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసార్ హాట్ కామెంట్స్ చేశారు. హైకోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. రంగనాథ్‌కు మజ్లీస్ మీదున్న ప్రేమ.. ప్రజల మీద లేదని విమర్శించారు. కోర్ట్‌ను తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. నాదర్‌గుల్‌లో చాలా ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో ఎకరాల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తెలిపారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా.. మరి మిగతా2లో..

## రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

**ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్**



హైదరాబాద్,ఆగస్ట్10 : భారత ప్రభుత్వ కేబినెట్ కార్యదర్శి డా. టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాలప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'రిఫార్మ్ ఉత్సవ్ కార్యక్రమం అమలు, కార్యాచరణపై రాష్ట్రాలకు వివరించారు. అక్టోబర్ మిగతా2లో..

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

- రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు

హైదరాబాద్,ఆగస్ట్10 : తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ పక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ మిగతా2లో..

## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

- రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి
- మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ



హైదరాబాద్,ఆగస్ట్10 :తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని మిగతా2లో..

## డబుల్ ఇంజన్ స్పీడుతో ముందుకెళ్తున్నాం

- వైకాపాలా కాకుండా అభివృద్ధికే పెద్దపీట వేస్తున్నాం
- రౌడీలను, గంజాయి బ్యాచ్‌లను కఠినంగా అణిచివేస్తాం
- కలిదిండి సభలో సిఎం చంద్రబాబు ఉద్ఘాటన



ఏలూరు,ఆగస్ట్10 : డబుల్ ఇంజన్ స్పీడుతో ముందుకెళ్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సోమవారం ఏలూరు జిల్లాలోని కలిదిండిలో 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజల ఉత్సాహం చూస్తూంటే, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏదే విజయమనిపిస్తోందని తెలిపారు. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం డబుల్ ఇంజన్ స్పీడుతో ముందుకు పోతున్నామని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పనులు పూర్తి చేసి ఆనందం పడుతుంటే.. గొడ&ఢలి పార్టీ ఏం చేస్తుందో చూస్తున్నామని అన్నారు. జగన్ బాబాయ్ వివేకానందరెడ్డిని చంపి, ఆ నేరం తనపై నెట్టి నారాసుర రక్త చరిత్ర అని పేపర్‌లో వేశారని ఆగ్రహించారు. రౌడీలను, గంజాయి బ్యాచ్‌లను అణిచివేస్తామని హెచ్చరించారు. ఒకప్పుడు కరెంటు లేని పరిస్థితి నుంచి ఈ రోజు సోలార్ పవర్ తయారు చేసుకునే పరిస్థితికి వచ్చామని తెలిపారు. ఏపీని స్వర్ణాంధ్రగా మార్చే క్రమంలో అడ్డు వచ్చేవారికి సహాయ నిరాకరణ చేయాలని అన్నారు. ఈ ఏడాది 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా మిగతా2లో..




## ఫార్చ్యూన్ ఇండియాలో లోకేశ్‌పై కథనం

- కోటి కర్చు చేశారన్న ప్రచారం ఖండించిన ప్రభుత్వం

అమరావతి,ఆగస్ట్10 : ఫార్చ్యూన్ ఇండియా పత్రికలో మంత్రి నారా లోకేశ్‌పై వ్యాసం కోసం కోటి రూపాయలకుపైగా ప్రభుత్వ ధనం ఖర్చు చేశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వం స్పష్టం చేసింది. లోకేశ్‌పై తప్పుడు ప్రచారాన్ని ఖండించింది. మిగతా2లో..



## పోలవరం తొలిదశ నిర్మాణానికి కేంద్రం ఆమోదం

- సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్10 : పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. తొలి దశలో 41.15 మీటర్ల వరకు మిగతా2లో..

## ఫార్చ్యూన్ ఇండియాలో లోకేశ్‌పై కథనం

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జీవోకు, ఫార్చ్యూన్ ఇండియా కథనానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 18-1-2025న జారీ చేసిన జీవో.. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీ పెట్టుబడి అవకాశాల ప్రచారం కోసం ఇచ్చిందని.. ఓ ఆంగ్ల ఛానల్‌కు చెల్లింపులు చేయాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాలే ఆ జీఓలో ఉన్నాయని ఏపీ సర్కార్ వెల్లడించింది.ఫార్చ్యూన్ ఇండియా, సిఎన్‌బిసి టివి రెండు వేర్వేరు సంస్థలని.. రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని సర్కార్ వివరణ ఇచ్చింది. జీవోను వక్రీకరించి మంత్రి నారా లోకేశ్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ప్రజలకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందించడం నేరమని హెచ్చరించింది. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేసింది. తప్పుడు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఏపీ ప్రభుత్వం స్పష్టీకరించింది.

## రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

2026 నుంచి రిఫార్మ్ ఉత్సవ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేబినెట్ కార్యదర్శి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరించి, వాటిని ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రిఫార్మ్ ఉత్సవ్‌ను మూడు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశగా ఆగస్టు-సెప్టెంబర్ 2026లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు, అధికారుల సెన్సిటైజేషన్, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయి. రెండో దశ అక్టోబర్-డిసెంబర్ 2026లో రిఫార్మ్ ఉత్సవ్గా నిర్వహించనున్నారు. ఇందులో జన్ మంథన్ కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 31 వరకు, విమర్శ్ జన్ సమాధాన్ కార్యక్రమాలు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించి, త్వరితగతిన అమలు చేయగల సంస్కరణలు, మధ్యకాలిక సంస్కరణలపై దృష్టి సారించనున్నారు. సంకల్ప సిద్ధి కార్యక్రమం అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. మూడో దశగా డిసెంబర్ 28, 2026 నుంచి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఇందులో నిర్మాణాత్మక సంస్కరణలపై నిరంతర పర్యవేక్షణ, తదుపరి చర్యలు మరియు సమర్పణ ఉంటాయి. రిఫార్మ్ ఉత్సవ్ అమలుకు ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ ను, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు నవీన్ మిట్టల్, స్టీఫెన్ రవీంద్ర, బి. పాపిరెడ్డి, లా సెక్రటరీ, అనుదీప్ దురిశెట్టి, అహ్మద్ నదీమ్, మహేష్ దత్ ఎక్కా, గౌరవ్ ఉప్పల్, స్వాతి లక్రా, దేవసేన, దివ్య దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఎస్ఆర్ఎస్పీ స్టేజ్-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

## అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' అని అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.

## బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు

అని అన్నారు. పుట్టుకతోనే చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజయ్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ గాంధీ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహేష్ కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

## ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు పండించామని ఆయన తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో

## మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని లవ్లీనా తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోదీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని

## గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి

హైదరాబాద్,ఆగస్ట్10 :తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్' ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన

## సాగర్‌లో ముగిసిన వరుణయాగం

యాగం' నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు , వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమగుండాలతో ఈ మహా యాగాన్ని శాస్త్రోక్తంగా పూజలు జరిపి పూర్తి చేశారు. ఈ వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని హోమగుండంలో పూర్ణాహుతి సామాగ్రిని సమర్పించారు. కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు , రిజర్వాయర్లు నిండి

## డబుల్ ఇంజన్ స్పీడుతో ముందుకెళ్తున్నాం

జరుపుకోవాలని సూచించారు. ఆ రోజు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చడానికి ఒక సంకల్పం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొల్లేరు విషయంలో అన్ని విషయాలు జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని తెలిపారు. శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం రాకముందు రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న వారికి పట్టాలు ఇచ్చారని ప్రస్తావించారు. అప్పటి సమస్యలు ఇప్పుడు పరిష్కరించామని సీఎం వెల్లడించారు. ఇంతకన్నా రాజకీయ జీవితంలో కావాల్సినదేముందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాల్లో ఎవరి ఫొటో వేసుకోడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో వారు భూములు అడిగితే, ప్రజలు ఇవ్వకపోతే, ఆ భూములను 22ఏ లో పెట్టి ఇబ్బందులు పెట్టారని ధ్వజమెత్తారు. ఆయా సమస్యలు పరిష్కరిస్తే, ప్రజలు జేజేలు కొడతారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే 151 సీట్ల పార్టీ ఏమైందో ప్రజలు చూశారని సీఎం చంద్రబాబు అన్నారు. తాను కూడా బటన్ నొక్కవచ్చని, పరదాల చాటున రావచ్చని, విమానంలో తిరిగి వెళ్లిపోవచ్చని కానీ జగన్ లాగా తాను చేయనని తెలిపారు. ఇలా చేస్తే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయా అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 7700 గ్రామాల్లో 32 లక్షల 32 వేల పాస్ పుస్తకాలు ఇచ్చామని ప్రస్తావించారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఉపయోగించి పాస్ పుస్తకాలు చేయించామని తెలిపారు. దానిలోని వివరాలు ఎవరు మార్చలేరని అన్నారు. 9365 గ్రామాల్లో 68 లక్షల 64వేల పాస్ పుస్తకాలు ఇవ్వాలని తెలిపారు. రాబోయే ఏడు నెలల్లో వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని

తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి..భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూములతో పాటు మిగతా ఆస్తులను కూడా మ్యాపులతో సహా అందజేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.ఎలాంటి స్వార్థం లేకుండా రైతుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన.. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీరు తక్కువగా వినియోగించే పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయానికి శంకుస్థాపన మరియు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని మంత్రులు కలిసి ప్రారంభించడం జరిగింది. హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సహచర మంత్రులు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

## - హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని అన్నారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్ర్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇదిలావుంటే తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.

మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు.సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

పంటలు సమృద్ధిగా పండాలని సీఎం దంపతులు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ క్రతువులో పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొనగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కాంక్షిస్తూ.. ప్రభుత్వం వరుణయాగం నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు యాగ క్రతువులో పాల్గొన్నారు.

పేర్కొన్నారు. రౌడీలను, గంజాయి బ్యాచ్‌లను అణిచివేస్తామని సీఎం వార్నింగ్ ఇచ్చారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ గౌరవప్రదమైన కార్యక్రమమని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి ఒక్కరి ఆత్మగౌరవానికి సంబంధించిన కార్యక్రమమని చెప్పారు. కోటి మందికి పట్టాలు ఇచ్చేటప్పుడు అవినీతి జరుగుతుందని.. అది జరగకుండా ఉండాలనే గ్రామసభల్లో ఇచ్చామని ప్రస్తావించారు. ప్రజలు కూడా కుటుంబ వివాదాలు తగ్గించుకుని, లిటిగేషన్లు లేకుండా చూడాలని సూచించారు. తాను నాలుగోసారి సీఎంగా చేస్తున్నానని.. సీఎం పదవి తనకు కొత్తమే కాదని చెప్పారు. అప్పటికన్నా స్పీడు పెంచానని తెలిపారు. టెక్నాలజీ కూడా పెంచామని వెల్లడించారు. ఈ జిల్లాలో ఎక్కడ చూసినా చేపల చెరువులు ఉంటాయని ప్రస్తావించారు.. తాగునీరు మాత్రం ఉండదని చెప్పారు. కైకలూరులో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.36 కోట్లను మంజూరు చేశామని తెలిపారు. సూపర్ సిక్స్ అమలు చేశామని స్పష్టం చేశారు. గుంతలు లేని రోడ్లపై సజావుగా ప్రయాణం చేసేలా చేస్తామని వెల్లడించారు.ఇప్పటికే గడ్డు పరిస్థితులు అధిగమిస్తూ, ముందుకు పోతున్నామని చెప్పారు. ప్రపంచం అంతా ఆహారపు అలవాట్లు మారుతున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు.. భవిష్యత్తు అంతా ఆక్వారంగానిదే అని ఆనాడే చెప్పామని ప్రస్తావించారు. ఆక్వారంగాన్ని ఆదుకోవడానికి రూపాయిన్నరకే కరెంటు ఇచ్చామని తెలిపారు. వైసీపీ హయాంలో జోన్, నాన్ ఆక్వా జోన్ అని చెప్పి ఆక్వారంగాన్ని ఇబ్బంది పెట్టారని ధ్వజమెత్తారు. ఏపీలో ఒక దౌర్భాగ్య పార్టీ ఉందని.. అదే గొడ్డలి పార్టీ అని విమర్శించారు. తన 48 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో సమస్యలు చూశామని ప్రస్తావించారు. అప్పట్లో నక్సలైట్ల సమస్య ఉండేదని చెప్పారు.

## మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్

ఆ భూములను ఎక్కడ దాచిపెట్టారని.. ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదని నిలదీశారు. పరిపాలనలో లోపంతోనే అధికారులపై ఆరోపణలు వస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు. సల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాల ఆదేశాలున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చూస్తూ ఊరుకోం. క్యూర్‌పై ఆగస్ట్ 15 తర్వాత భాజపా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తాం. ఆ తర్వాత ఉద్యమాలు ఉధృతం చేస్తాం. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని రెండేళ్ల తర్వాత తప్పకుండా మారుస్తారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉంటాయని అనుకుంటున్నాం. ఇథనాల్‌తో వాహనాల ఇంజిన్లు పాడైపోతాయని ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుణయా గం చేస్తే.. తాము రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోవాలని వాయు యాగం చేస్తామన్నారు. వానాకాలం అంతా అయిపోయాక రేవంత్ రెడ్డిది ఇదో కొత్త నాటకమంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ఉన్న విషయం సీఎంకు తెలియదా అని రాంచందర్ రావు ప్రశ్నించారు.

## కేంద్రం మరోమారు తెలంగాణకు మొండిచేయి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్రం తిరిగిన వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర సాయం విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ జాతీయ హోదా గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2 పరిధిలో అంతర్రాష్ట్ర అంశాలు ఉండటంతో టెక్నో-ఎకనామిక్ అప్రైజల్ సాధ్యం కాదని, సమగ్ర ప్రణాళికతో డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టుకు సాయం విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. అంతేకాకుండా, ప్రాజెక్టుకు కేంద్ర నిధుల సాయం అందించే విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. జాతీయ ప్రాజెక్టు హోదా అనేది ప్రధానంగా జాతీయ ప్రాధాన్యం, అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ జల వివాదాలు లేకపోవడం , గణనీయమైన సాగునీటి సామర్థ్యం ఆధారంగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఇస్తామని కేంద్రం పునరుద్ఘాటించింది. కృష్ణా జలాలపై క్లియరెన్సులు, ట్రిబ్యునల్ పరిధిలోని అంశాలు తేలితే తప్ప ఈ ప్రాజెక్టు హోదాపై తదుపరి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది.

## పోలవరం తొలిదశ నిర్మాణానికి కేంద్రం ఆమోదం

ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపింది. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,620.53 కోట్ల నిధులు విడుదల చేసిందని పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.5,512.40 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఈ సందర్భంగా స్పిల్‌వే నిర్మాణంలో ఇప్పటివరకు 96.87 శాతం మట్టి పనులు పూర్తయ్యాయని కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. కాంక్రీట్ పనులు 98.84 శాతం, స్టీల్ పనులు 92.9 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించింది. అలాగే ఎర్త్-కమ్-రాక్‌ఫిల్ డ్యామ్‌కు సంబంధించి కాంక్రీట్ పనులు 81.99 శాతం పూర్తయ్యాయని పేర్కొంది. ప్రధాన కాలువల తవ్వకం పనులు 98.96 శాతం పూర్తయ్యాయని వివరించింది. ప్రాజెక్టు తొలి దశలో మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. పోలవరం తొలి దశలో నిర్వాసిత కుటుంబాల పునరావాసం, పునరావాస ప్యాకేజీల అమలుపైనా కేంద్రం వివరాలు వెల్లడించింది. ఇప్పటివరకు 17,892 నిర్వాసిత కుటుంబాలను తరలించినట్లు తెలిపింది. ఆర్అండ్ఆర్ పరిహారం కింద రూ.1,373.01 కోట్లు పంపిణీ చేసినట్లు కేంద్రం పేర్కొంది. పునరావాసం, పునరావాస పనులకు అదనంగా రూ.1,581.08 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు తొలి దశను మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం తెలిపింది. అవసరమైతే మరో ఏడాది గడువు పొడిగించే వెసులుబాటు కూడా ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితుల పునరావాసం, పునరావాస పనులను సమాంత రంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని రాజ్యసభకు ఇచ్చిన సమాధానంలో కేంద్ర జలశక్తి శాఖ పేర్కొంది.

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

తాను వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తుంటే, 23 క్లామోర్‌మైన్స్ పెట్టి చంపాలని చూశారని అన్నారు. తాను భయపడలేదని.. తాను ప్రజలకు చేసిన మంచి తనను కాపాడుతుందని భావించానని అన్నారు. రాయలసీమ రాజకీయ ముఠా కక్షలు .. లేకుండా చేయాలని గట్టిగా తాము నిర్ణయించుకున్నామని.. వాటిని లేకుండా చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో గతంలో మత కక్షలను రెచ్చగొట్టి, ఆరునెలలు కర్ఫ్యూ ఉండే పరిస్థితి ఉండేదని సీఎం చంద్రబాబు చెప్పారు. 2019 నుంచి 2024 వరకు గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లు ఉండేవని, రౌడీయిజం చెలాయించేవారని అన్నారు. రౌడీయిజాన్ని పూర్తిగా అరికట్టామని స్పష్టం చేశారు. కొంతమంది పొగాకు రైతులు మంచి రేటు వస్తుందని ఎక్కువగా పంట వేశారని తెలిపారు. దానివల్ల రేటు తగ్గిందని.. తాము కేంద్రప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. దేవరపల్లిలో రైతులను పరామర్శించడానికి జగన్ వచ్చారని.. రైతుల పంటను తొక్కేశారని ఆగ్రహించారు. చొక్కాలు విప్పి విన్యాసాలు చేశారని.. బైకులతో జనాలను ఢీకొట్టారని మండిపడ్డారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇవ్వకుండా 356 పిటిషన్లు వేశారని దుయ్యబట్టారు. కష్టపడి చదివిన వారికి ఉద్యోగాలు ఇస్తే.. సంవత్సరం తర్వాత వైసీపీ వారు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారని ఆగ్రహించారు. వైసీపీకి వ్యతిరేకంగా కర్నూలులో ఆందోళన చేశారని.. అయినా వారికి సిగ్గుండాలని విమర్శించారు. ఈ రోజు మళ్లీ ఆందోళన చేస్తున్నారని మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయాన్ని తమ ప్రభుత్వం పూర్తి చేస్తే.. తామే చేశామని వైసీపీ నేతలు ఇప్పుడు చెప్పడం విడ్డూరంగా ఉందని సీఎం ఎద్దేవా చేశారు. పోలవరం, అమరావతి పూర్తి అయితే అది తామే చేశామంటారని విమర్శించారు.

# సంపాదకీయం

## ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు !

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే...పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠిచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెన్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు. ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



సూర్యాపేట ఆగస్టు 10:(విజన్ ఆంధ్ర)దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి, రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు అందుతున్న రిజర్వేషన్లు, రాయితీలు, హక్కులను వర్తింపజేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు బిషప్ సీహెచ్ సాల్మాన్‌రాజ్, పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ శాంసన్ మామిడి, పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎం. ప్రభుదాస్ డిమాండ్ చేశారు.సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం ఎక్స్‌రోడ్డు వద్ద బ్లాక్‌డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950లో అమలులోకి వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా మతం మారిన దళిత క్రైస్తవులు రాజ్యాంగపరంగా తమకు దక్కాల్సిన ఎస్సీ హోదా, రిజర్వేషన్లకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులకు కూడా సమాన హక్కులు కల్పించాలని కోరారు. మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక పరిస్థితులు మారవని, వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో వారికి రాజ్యాంగపరమైన రక్షణలు, హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వాన్ని, ఆర్టికల్ 16 సమాన అవకాశాలను కల్పిస్తున్న నేపథ్యంలో దళిత క్రైస్తవుల విషయంలో వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు, సామాజిక కార్యక్రమాలు, విద్య, ఉద్యోగాలు తదితర రంగాల్లో దళిత క్రైస్తవులు వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు.దళిత క్రైస్తవుల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మానవ హక్కుల సమస్యగా చూడాలని నాయకులు కోరారు. దేశంలోని ఇతర వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అందుతున్నప్పుడు దళిత క్రైస్తవులకు మాత్రం వాటిని నిరాకరించడం సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. విద్య, ఉద్యోగాలు, సామాజిక, ఆర్థిక రంగాల్లో దళిత క్రైస్తవులకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.దళిత క్రైస్తవుల న్యాయమైన డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా పరిశీలించాలని కోరారు. గతంలో వివిధ ప్రభుత్వాలు, రాష్ట్ర అసెంబ్లీలు ఈ అంశంపై కేంద్రానికి సిఫార్సులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి బలమైన సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు ఉద్యమాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. తాము కూడా ఓటు హక్కు కలిగిన భారత పౌరులమని, తమ సమస్యను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బేడ బుడగ జంగాల సంఘ రాష్ట్ర అధ్యక్షునికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి




హనుమకొండ, జిల్లా ప్రతినిధి ఆగస్టు 10( విజన్ ఆంధ్ర ):తెలంగాణ రాష్ట్రంలో బేడ బుడగ జంగం సమాజ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న బుడగ జంగం జనసంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణుకి తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవిని కల్పించాలని వరంగల్ జిల్లా అధ్యక్షుడు సిరిగిరి జంపయ్య కోరారు. సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంపయ్య మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బేడ బుడగ జంగం సమాజం తరపున గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, పార్టీ విజయానికి తమ వంతు కృషి చేసినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2024లో ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు సానుకూల తీర్పు వెలువడిన అనంతరం, తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన వెంటనే, రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 26 జిల్లాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహించి, బేడ బుడగ జంగం సమాజాన్ని మాల, మాదిగలతో కలపకుండా ప్రత్యేక ఉపవర్గంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఉద్యమాన్ని ముందుకు నడిపారని,అంతేకాకుండా, రాష్ట్ర మంత్రులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించి, బేడ బుడగ జంగం సమాజానికి ప్రత్యేక గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో భాగంగా బేడ బుడగ జంగాలను ప్రత్యేకంగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు కేటాయించడంలో కృషి కృషి చేశారని,గతంలో ఉన్న నాయకత్వంతో పోల్చితే సమాజాన్ని సంఘటితం చేయడం, హక్కుల సాధన కోసం పోరాడడం, ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవడం వంటి అంశాల్లో సిరిపాటి వేణు నాయకత్వం విశేషంగా నిలిచిందని, ఆయన నాయకత్వంలో పనిచేయడానికి వరంగల్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో మాల, మాదిగల తరువాత జనాభా పరంగా మూడవ అతిపెద్ద ఎస్సీ వర్గంగా ఉన్న బేడ బుడగ జంగం సమాజానికి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా తగిన రాజకీయ గుర్తింపు గాని, ఉన్నత పదవులు కల్పించేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం, రాజకీయ సమానత్వం కోసం తీసుకుంటున్న చర్యలను జిల్లా కమిటీ హృదయపూర్వకంగా అభినందిస్తోందని,ఈ నేపథ్యంలో సమాజ సేవ, ఉద్యమ నిబద్ధత, నాయకత్వ సామర్థ్యం, ప్రభుత్వంతో సమర్థవంతమైన సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని వేణుకి ఎస్సీ కార్పొరేషన్ పదవి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగాల నాయకులు కత్తి మల్లయ్య,సోమయ్య,రాజు,జగన్ తదితరులు పాల్గొన్నారు.

## దద్దరిల్లిన జైల్ భరో..




సూర్యాపేట ఆగస్టు 10:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, విద్యార్థి వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం అంజన్నపురి కాలనీలో ఆల్ ఇండియా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు జైల్ భరో కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.కార్మికుల హక్కులను కాలరాసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని బాలకృష్ణ ఆరోపించారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే చర్యలను వెంటనే నిలిపివేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం కలిగించే విధానాలను విడనాడి, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులను నిలిపివేసి ప్రజలకు నిరసన తెలిపే హక్కును కాపాడాలని కోరారు.కార్మికులు, రైతులు, విద్యార్థుల హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని బాలకృష్ణ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ధర్నా సందర్భంగా నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు నిరసనకారులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు చొక్కయ్య గౌడ్, జిల్లా జనరల్ సెక్రెటరీ వెంకట్, సోషల్ మీడియా ఇన్చార్జి గోపి, రమేష్ నాయక్, మహేష్, పాపయ్య గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్షర ఫౌండేషన్ కు వైకుంఠ రథం వాహనం అందజేత



సూర్యాపేట ఆగస్టు 10:(విజన్ ఆంధ్ర)ఎస్ కె ఆర్ కన్స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు సూర్యాపేట జిల్లా ప్రజలకు ఉపయోగపడే 14 లక్షల మహేంద్ర బొలెరో వైకుంఠ రథం వాహనం అక్షర ఫౌండేషన్ సభ్యులకు ఎస్ కే ఆర్ కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సంకినేని కృష్ణారావు గారు అందజేశారు. సంకినేని కృష్ణారావు గారు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అంత్యక్రియల సమయంలో వైకుంఠ రథ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రుద్రంగి కాళిదాస్ మాట్లాడుతూ హాస్పిటల్లో చనిపోయిన మృతదేహాలను వారి గ్రామాలకు చేరవేయుట, అత్యవసర సమయములో మృతదేహాలను రవాణా చేయుట, సూర్యాపేట పట్టణం పరిసర ప్రాంత గ్రామాలలో దహన సంస్కారాలకు వైకుంఠ రథ సేవలు అందించుట, వీటితోపాటు డెడ్ బాడీ ఫ్రీజర్స్ కూడా 24 గంటలు ట్యాంక్ బండ్ దగ్గర గల హిందూ మహా ప్రస్థానం నందు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ వైకుంఠ రథ సేవలు సూర్యాపేట జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోగలరు. మున్ముందు అక్షర సేవలు ఇంకా విస్తరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, బత్తుల దామోదర్ రెడ్డి, ఉప్పల మధు, రమేష్, మందడి రమాదేవి, షేక్ నజీర్ భాష, బత్తుల ఉపేందర్, ధరావత్ వీరాసింగ్, రామకృష్ణ, గడ్డం వీరబాబు, జటంగి ముత్తయ్య, నాగరాజు,యాస అక్షయ్ రెడ్డి, వివేకానంద రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

## ఒడ్డుగూడ గ్రామంలో బూర పోచన్న కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



దహేగం ఆగస్టు 10(విజయనగ) కొమరం భీం జిల్లా దహేగాం మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బూర పోచన్న మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోమవారం బూర పోచన్న నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బూర పోచన్న తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. బాధలో ఉన్న కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కోనేరు కోనప్ప భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా మృతురాలికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ పెద్దలు కోనేరు కోనప్ప పరామర్శ పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దహేగాం మాజీ ఎంపీపీ కంభాగౌని సులోచన, సంతోష్ గౌడ్, దహేగాం, పెంచికల్పేట్ మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు రహిత ప్రాంతంగా కర్రెగుట్టలు : డీజీపీ సీవీ ఆనంద్

వెంకటాపురం-నూగూరు, ఆగస్టు 10, (విజన్ ఆంధ్ర):కర్రెగుట్టల ప్రాంతాన్ని మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ సర్కిల్ పరిధిలోని పామునూరు సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపును ఆయన సందర్శించారు. పామునూరు నుంచి ఛత్తీస్ గఢ్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం కర్రెగుట్టల్లో పోలీస్ జెండాను ఎగురవేసి, శాంతికి ప్రతీకగా పావురాలను ఎగురవేశారు.

**-అభివృద్ధికి కొత్త బాటలు**

సుమారు 50-60 ఏళ్లుగా మావోయిస్టు ప్రాబల్య ప్రాంతంగా ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేత అనంతరం ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొందని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. పామునూరు బేస్ క్యాంపు నుంచి ఛత్తీస్గఢ్ వరకు రహదారి నిర్మాణ పనులు మంజూరయ్యాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్లో ఈ ప్రాంతాన్ని ప్రజా రవాణాకు అనుకూలంగా తీర్చిదిద్దడంతోపాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పూర్తయిన రహదారి చివరి భాగం వరకు వెళ్లి పనులను ఆయన పరిశీలించారు.





**-ఆదివాసులకు అండగా ప్రభుత్వం**

పామునూరులో నివసిస్తున్న గ్రామస్తులకు డీజీపీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఆదివాసీ గ్రామాల ప్రజలకు పోలీసు శాఖ తరఫున పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇంకా మావోయిస్టు కార్యకలాపాల్లో ఉన్న వారు ఎక్కడ ఉన్నా పోలీసుల ఎదుట లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున పునరావాసం, అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ, ఐజీ, ములుగు జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్, అటవీ శాఖ ఉన్నతాధికారులు, సీఆర్పీఎఫ్ అధికారులు, జిల్లా పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో డీజీపీ వివిధ అంశాలపై మాట్లాడారు.

## డీఎస్సీ నిర్వహణలో తీవ్ర అవకతవకలు

**- సీబీఐ విచారణకు బొత్స డిమాండ్**

విజయనగరం,ఆగస్ట్10 : రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని, దీనిపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత మంత్రిని పదవి నుంచి పక్కన పెట్టాలని స్పష్టం చేశారు. యువత, నిరుద్యోగులు తమ సమస్యలపై గత డెబ్బై రోజులకు పైగా పోరాటం చేస్తున్నారని, వారు ర్యాలీలు చేయడానికి ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. వెనక్కి వెళ్తామన్నా ఒప్పుకోకుండా, కనీసం శాంతియుత ర్యాలీలకు కూడా అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదని విమర్శించారు. వచ్చే ఆదాయంలో సగం డబ్బులు ఉద్యోగుల జీతాలకే సరిపోతున్నాయని చెబుతున్న చంద్రబాబు, ఎన్నికల ముందు చెప్పిన సంపద సృష్టి ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. ఒకవైపు సంపద సృష్టిస్తామని చెప్పి, మరోవైపు రాష్ట్రాన్ని తీవ్ర అప్పుల పాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసలు ఏ రంగంలో అభివృద్ధి సాధించారో చంద్రబాబు స్పష్టత ఇవ్వాలని సవాల్ విసిరారు.వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, పేదలకు వరమైన ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిచారని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పట్టించుకోకుండా కేవలం అమరావతి జపం మాత్రమే చేస్తున్నారన్నారు. మరోవైపు రైతులకు ఏ పంటకూ కనీస మద్దతు ధర లభించడం లేదని వాపోయారు. ఈ ప్రభుత్వం కేవలం వ్యక్తిగత స్వార్థపూరిత ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని, ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఆడపిల్లలు బయటకు రావాలంటేనే తీవ్ర భయాందోళనలకు గురయ్యే పరిస్థితి నెలకొందని బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పేద పిల్లల నాణ్యమైన విద్యకు కేరాఫ్ కాంగ్రెస్ ప్రభుత్వమే

**--ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ విద్యాసంస్థలు దీటుగా తీర్చిదిద్దుతున్నాం..**

**--రూ.3.25 కోట్లతో ఎల్కతుర్తిలో నిర్మించిన కేజీబీవీ నూతన భవనం ప్రారంభించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్..**



హన్మకొండ బ్యూరోచిఫ్ /ఎల్కతుర్తి ఆగస్టు10(విజన్ ఆంధ్ర)పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేదల పక్షపాతిగా పనిచేస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో రూ.3.25 కోట్లతో నిర్మించిన కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) నూతన భవనాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేద కుటుంబాల పిల్లలు కూడా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యను పొందేలా ప్రభుత్వం విద్యారంగంపై భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పిల్లలు కడుపునిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో డైట్ ఛార్జీలను 40 శాతం, పేదింటి ఆడపిల్లలు వసతి గృహాల్లో చదువుకునేందుకు అవసరమైన కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు, పుస్తకాలు, ఇతర సామగ్రిని విద్యా సంవత్సరం ప్రారంభమైన నెల రోజుల్లోపే నాణ్యమైన మెటీరియల్‌తో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున కేటాయించి, సుమారు 3,500 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతమైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను నిర్మిస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పేద పిల్లలకు మంచి విద్యను అందిస్తే వారు తమ కాళ్లపై తాము నిలబడటమే కాకుండా, మరో పది మందికి, వంద మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతారని మంత్రి అన్నారు. గతంలో పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వాల వద్ద పెద్దఎత్తున భూములు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ చెబుతున్నారని పేర్కొన్నారు. అందుకే పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడానికి విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

విద్య, వైద్యం పేదల జీవితాలకు రెండు కళ్ల వంటివని, ఈ రెండు రంగాలను బలోపేతం చేసి పేదల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ విజ్ఞప్తి మేరకు విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి వెంటనే స్పందించారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రిల్స్, ప్రహరీ తదితర అవసరమైన పనులను టాప్ ప్రాధాన్యతతో చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రజా ప్రభుత్వం : మంత్రి పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.... రాష్ట్ర విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు మౌలిక వసతులు, నూతన భవనాల నిర్మాణం, ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో విద్యాబోధనపై పూర్తి దృష్టి సారించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యే భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి బలమైన పునాది అని పేర్కొంటూ, పెరుగుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా నైపుణ్యాలు, వృత్తి పరమైన సామర్థ్యాలను పెంపొందించుకునేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. విద్య పూర్తయ్యే నాటికి ప్రతి విద్యార్థికి మెరుగైన ఉపాధి, భవిష్యత్ అవకాశాలు లభించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ**

ఎల్కతుర్తి కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణ కార్యక్రమం పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. నాబార్డు నిధులతో అదనపు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ నిర్మాణ పనులు కూడా చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని కేజీబీవీలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, అన్ని జూనియర్ కళాశాలల్లో అదనపు తరగతి గదులు, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు.

విద్యార్థులకు నూతన యూనిఫాంలతో పాటు ట్రంక్ బాక్సులు, ఇతర అవసరమైన సామగ్రిని అన్ని పాఠశాలలకు ఇప్పటికే అందజేశామని తెలిపారు. కేజీబీవీల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అన్న అంశంపై ఏపీసీలు, కోఆర్డినేటర్లు, డీఈఓ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు విద్యార్థినులకు బ్లాంకెట్లు, ట్రంక్ బాక్సులు, కార్పెట్లు, ఇతర అవసరమైన సామగ్రిని స్వయంగా అందజేశారు. నూతన భవనంలో విద్యార్థినులకు అందుబాటులోకి వచ్చిన వసతులను పరిశీలించి, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యలో ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు ఘనంగా సన్మానించి, అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈఓ గిరిరాజ్ గౌడ్, ప్రిన్సిపాల్ అనితాదేవి , వివిధ శాఖల అధికారులు, కేజీబీవీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 22వ వార్డులో నిర్మాణంలో 32 ఇండ్లు

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం**




సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర)ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 8 ఇండ్లు పూర్తయ్యాయని, 22 ఇల్లు నిర్మాణంలో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారనిజిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. ఆదివారం ఆయన వార్డు కౌన్సిలర్ రియాజ్ తో కలిసి వార్డులో పర్యటించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద నిర్మాణంలో ఉన్న ఇళ్లను తనిఖీ చేసి, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారునికి రూ 5 లక్షలు మంజూరు చేసి, నిర్మాణ పురోగతిని అనుసరించి విడతల వారీగా నిధులు వారి ఖాతాల్లోజమచేస్తున్నామని వివరించారు. తెలుపు రేషన్ కార్డు కలిగిన వారికి 6 కిలోల ఉచిత బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు వైద్య సేవలు, రైతు రుణమాఫీ 2 లక్షల వరకు, ఇందిర సౌర పథకం కార్యక్రమాలు బీద ప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, త్వరలో పూర్తవుతాయని తెలిపారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి చేయకుండా ఇప్పుడు విమర్శలు చేస్తున్నారనీ, తమ వైఫల్యాలను దాచడానికి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో సిద్దిపేటలో మున్సిపల్ ఎన్నికలు విజయం సాధించి, చైర్మన్ పదవిని దక్కించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవితేజ, సలీం తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఏఆర్ఎస్ఐ గుండెపోటుతో మృతి



హన్మకొండ బ్యూరోచిఫ్ ఆగస్టు 10(విజన్ ఆంధ్ర) వరంగల్ కమిషరేట్ ఆర్మ్మార్ రిజర్వ్ విభాగంలో ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీ ఎస్. శామ్యూల్ (57) ఈ రోజు ఉదయం సమయంలో హనుమకొండలోని ప్రకాశ్ రెడ్డి పేట జంక్షన్ వద్ద గల తన నివాసంలో ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందారు. విధులకు హాజరయ్యేందుకు బయలుదేరుతున్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. 1989న పోలీస్ శాఖలో విధుల్లో చేరిన శామ్యూల్ సుమారు 37 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో సేవలందించారు. ఆయన మృతి పట్ల పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

## కర్రలతో కొట్టి, బూట్లతో ముఖంపై తొక్కి శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థిపై దారుణంగా దాడి చేసిన తోటివిద్యార్థులు,



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): దమ్మాయిగూడలోని శ్రీచైతన్య హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న కామారెడ్డికి చెందిన అభిషేక్ అనే విద్యార్థి,రాత్రి సమయంలో హాస్టల్లో అభిషేక్‌ను కర్రలు, ప్లేట్లతో కొట్టి, బూట్లతో ముఖంపై తొక్కి దారుణంగా దాడి చేసిన 12 మంది విద్యార్థులు గాయపడగా,తీవ్రంగా గాయపడిన తమ కుమారుడు మెట్ల మీద నుంచి కిందపడిపోయాడంటూ స్కూల్ యాజమాన్యం తమకు ఫోన్ చేసి చెప్పారని, వెంటనే వెళ్లి తమ కొడుకును ఇంటికి తీసుకొచ్చామని తెలిపిన బాలుడి తల్లిదండ్రులు.ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అభిషేక్,తనపై ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు దాడి చేశారని అభిషేక్ చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులుతమ కొడుకుపై దాడి చేసిన వారిపై, ఘటన బయటకు రాకుండా దాచిన స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలుడి తల్లిదండ్రుల డిమాండ్ చేశారు.

## ఉత్తరాఖండ్‌లో భారీ వర్ష బీభత్సం

**- చమోలీలో కొట్టుకు పోయిన వంతెన**

డెహ్రాడూన్,ఆగస్ట్10 : ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చమోలీ జిల్లాలోని నీతి వ్యాలీ ప్రాంతాన్ని సోమవారం వరదనీరు ముంచెత్తింది. వరద ధాటికి ఓ వంతెన క్షణాల్లో కొట్టుకుపోగా.. పలువురు ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. భారీ వర్షాల కారణంగా నీతి వ్యాలీ ప్రాంతంలో ఉన్న నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. లోతట్టు ప్రాంతాల వైపు ఆ వరదనీరు దూసుకొచ్చింది. నీటితో పాటు మట్టి, బురద, పెద్దపెద్ద బండరాళ్లు కొట్టుకువచ్చాయి. ఈ క్రమంలో వరద ప్రవాహం బలంగా ఢీకొట్టడంతో ఓ ఇనుప వంతెన కొట్టుకుపోయింది. వంతెనకు ఓ వైపున ఉన్న పలు వాహనాలు కొట్టుకుపోగా.. మరోవైపు ఉన్న ఓ ట్రక్కు, ఎస్‌యూవీ వాహనాదారులు అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ప్రకృతి వైపరీత్యాన్ని అక్కడే ఉన్న కొంత మంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా నిమిషాల వ్యవధిలోనే వైరల్‌గా మారాయి. కాగా, వంతెన కొట్టుకుపోవడంతో నీతి వ్యాలీ ప్రాంతానికి ప్రధాన పట్టణంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఉత్తరాఖండ్‌లో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ, పునరావాస శాఖ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ తెలిపారు. డెహ్రాడూన్, బాగేశ్వర్, నైనిటాల్, చంపావత్ జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలతో రహదారులు దెబ్బతినడం, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

## ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనతో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణ

**-ఎంపీ డా. కడియం కావ్య..**




హన్మకొండ బ్యూరోచిఫ్ ఆగస్టు 10(విజన్ ఆంధ్ర)వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద ఆర్థిక సేవల పరిస్థితి, జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కార్డుల జారీ, ఆధార్ అనుసంధానం, ఖాతాల నిర్వహణ, డీబీటీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణపై కూడా వివరాలు కోరారు. వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వరంగల్ జిల్లాలో పీఎంజేడీవై ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా.. 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగాయి. ఇదే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470కు చేరాయి. రూపే కార్డులు 2,12,030 నుంచి 2,26,409కు పెరిగాయి. జన్‌ధన్ ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ ఆపరేటివ్ ఖాతాల సంఖ్యలో తగ్గుదల నమోదైంది. 2024 మార్చిలో 2,28,257 ఖాతాలు ఆపరేటివ్‌గా ఉండగా.. 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. పీఎంజేడీవై ఖాతాలకు అనుసంధానమైన డీబీటీ పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి తెలిపారు. లిఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ,లి జిల్లాలో జనధన్ ఖాతాల సంఖ్య పెరగడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఖాతాలు తెరవడమే కాకుండా అవి నిరంతరం వినియోగంలో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేందుకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరం చేయాలన్నారు. డిజిటల్ చెల్లింపులపై అవగాహనను మరింత విస్తరించి, మహిళలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు సహా ప్రతి వర్గానికి ఆర్థిక అక్షరాస్యత కల్పించాలని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు, డీబీటీ ప్రయోజనాలు అందేలా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలి అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

## హనుమకొండలో ఏఐఎస్ఎఫ్ ౯౦ వసంతాల రాష్ట్ర స్థాయి ఉత్సవాలు

**సెప్టెంబర్ 28,29,30 తేదీలలో నిర్వహణ**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్**




హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర) : సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండలో జరుగు ఏఐఎస్ఎఫ్ 90వ వసంతాల రాష్ట్రస్థాయి ముగింపు వారోత్సవాల సభలు జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ముగింపు ఉత్సవాల పోస్టర్ లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ దేశ స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి వరకు విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. "చదువుతూ పోరాడుతాం ▪ చదువుకై పోరాడుతాం" అనే నినాదంతో విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యా రంగానికి తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం ▪2020ను పునఃసమీక్షించి విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణమైన విద్యా విధానాన్ని రూపొందించాలని కోరారు. తెలంగాణలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలలు, కళాశాలలు,విశ్వవిద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ

600 మంది ప్రతినిధులతో రాష్ట్రస్థాయి వార్షికోత్సవాల మహాసభలు సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో జరిగే మూడు రోజుల కార్యక్రమాలను హనుమకొండలో నిర్వహిస్తున్నామని, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ లో పనిచేసిన మాజీ నాయకులు, ప్రస్తుత నాయకులు పాల్గొంటారని తెలిపారు. మొదటిరోజు భారీ ర్యాలీ, బహిరంగ సభ, రెండవ రోజు, మూడవ రోజు వారోత్సవ మహాసభలు జరగనున్నట్లు, డెలిగేట్స్ అందరికీ మూడు రోజులపాటు వసతి, భోజనం, కాన్ఫరెన్స్ హాల్ తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విద్యారంగ సమస్యలు – పరిష్కార మార్గాలు, ఏఐఎస్ఎఫ్ సంఘ నిర్మాణం, భవిష్యత్తు ఉద్యమాలపై పలు కీలకమైన నిర్ణయాలు జరగనున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ తొమ్మిది దశాబ్దాల పోరాట చరిత్రను స్మరించుకోవడంతో పాటు, ప్రస్తుత విద్యారంగ సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ విద్యార్థి ఉద్యమానికి నూతన కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలు, రాష్ట్రస్థాయి సభలను విజయవంతం చేసేందుకు విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు, యువత, ప్రజలు తమ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, జిల్లా నాయకులు కే అజయ్, నాగరాజు, వంశీ, రాజు, శ్రావణ్, ముఖేష్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మిడిదొడ్డిలో మున్నూరు కాపు పటేల్ సంఘం ఆధ్వర్యంలో ఆషాడ బోనాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర)సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలమిరుదొడ్డిలో ఘనంగా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ బోనాలుమిరుదొడ్డి మండలకేంద్రంలోమున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మహంకాళి దేవి ఆలయంలో ఆషాఢ బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ ఏనుముల మహేశ్వరి దేవరాజు మరియు మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు కుంట నారాయణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఈకార్యక్రమానికి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావుపటేల్,రాష్ట్రఉపాధ్యక్షులు నాయకం తిరుపతి పటేల్, జిల్లా అధ్యక్షులు గుర్రప్పగారి రాజులు, కోశాధికారి చల్ల నారాయణ, ప్రచార కార్యదర్శి మడిపల్లి బాపయ్య, సిద్దిపేట పట్టణ కార్యదర్శి నాయకంసత్యనారాయణతో పాటు మిరుదొడ్డి మండలానికి చెందిన మున్నూరుకాపు కులబాంధవులు, నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతోప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నాయకులు ఆకాంక్షించారు.

## తెలంగాణలో రానున్న రెండు రోజులు వర్షాలు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):తెలంగాణలో రానున్న రెండు రోజులు వర్షాలుబంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం వల్ల తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మంతో పాటు హైదరాబాద్ పరిసర జిల్లాల్లో సాయంత్రం వేళల్లో వానలు పడవచ్చని అంచనా వేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు10(విజన్ అంధ్ర) కొమురం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండల కేంద్రంలో భూ మాఫియా రెచ్చిపోతున్నారని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆక్రమణలను వెంటనే తొలగించి ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ శివారులో సంకల్ప్ గ్రీన్ సిటీ పేరుతో 85/3, 86/3, 87/3 సర్వే నంబర్లలో లేఅవుట్‌కు అనుమతులు తీసుకుని, కోసిని గ్రామ శివారులోని సర్వే నంబర్లు 79, 80లోని సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.20 కోట్లు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా మున్సిపాలిటీకి చెందిన 216, 217, 218 సర్వే నంబర్లలోని భూమిని కూడా ఆక్రమించినట్లు ఆరోపించారు. శిశు మందిర్‌కు చెందిన రెండు ఎకరాల భూమి సైతం ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. అనుమతులు ఒకచోట తీసుకుని, హద్దులు మార్చి ప్రభుత్వ భూములను కలుపుకుని వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యల వల్ల భవిష్యత్తులో ప్లాట్లు కొనుగోలు చేసే అమాయక ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి వెంచర్లు ఏర్పాటు చేస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. 2002 నుండి సీలింగ్ లో ఉన్న భూములను 2023లో 36 గంటల భూమిని ఎనగంటి శ్రీనివాస్ పేరిట పట్టా ఎలా చేస్తారు అని అన్నారు,ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున్, రాష్ట్ర నాయకులు విజయ్, మురళి, విశాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అండర్‌పాస్ నిర్మించే వరకు పోరాటం ఆగదు

## అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలే సమాధానం చెబుతారు

### కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకపోతే ఎన్‌హెచ్ఏఐ కార్యాలయం ముట్టడి: సీపీఐ హెచ్చరిక..

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 ( విజన్ ఆంధ్ర)కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని బంబారా గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారి నిర్మాణం చేపట్టి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగించినప్పటికీ అధికారులు, ఎన్‌హెచ్ఏఐ యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమని లిభారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల భద్రతను గాలికొదిలి రహాఫ్వారియ గ+ నిర్మాణం చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, తక్షణమే అండర్‌పాస్ బ్రిడ్జి, బస్ షెల్టర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటులి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, బంబారా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూలి, బంబారా ప్రజల ప్రాణాలతో



చెలగాటమాడే విధంగా జాతీయ రహదారి నిర్మాణం జరిగిందని మండిపడ్డారు. ప్రజలు ఒక వైపు నుంచి మరో వైపుకు వెళ్లేందుకు సరైన సదుపాయం కల్పించకుండా రహదారి నిర్మాణం పూర్తి చేయడం అధికారుల బాధ్యతారహిత్యానికి నిదర్శనమన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు, కూలీలు ప్రమాదకర పరిస్థితుల్లో జాతీయ రహదారి దాటాల్సి వస్తోందని, ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల ప్రాణాలు పోయిన తర్వాత అధికారులు మేల్కొనే పరిస్థితి రావద్దని హెచ్చరించారు. బంబారా గ్రామానికి తక్షణమే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించడంతో పాటు ప్రయాణికుల కోసం బస్ షెల్టర్, రాత్రివేళ ప్రమాదాల నివారణకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ పై సమగ్ర విచారణ జరిపి, తప్పులు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలపై పలుమార్లు అధికారులకు విజ్ఞప్తులు చేసినా స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట అని విమర్శించారు. ఇకపై వినతులు, విజ్ఞప్తులతో సమస్య పరిష్కారం కాకపోతే ప్రజా ఉద్యమం ద్వారానే అధికారులకు సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. బంబారా గ్రామ సర్పంచ్ బండారి కృష్ణాజీ మాట్లాడుతూలి గ్రామ ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన సమస్యను అధికారులు తేలిగ్గా తీసుకోవడం సరికాదన్నారు. గ్రామ ప్రజల సమస్య పరిష్కారం కోసం అవసరమైతే ఎన్‌హెచ్ఏఐ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టేందుకు గ్రామ ప్రజలను సమీకరిస్తామని హెచ్చరించారు. అండర్‌పాస్ నిర్మాణానికి హామీ ఇచ్చే వరకు పోరాటం కొనసాగుతుంది... హామీ అమలు చేసే వరకు సీపీఐ ఉద్యమం ఆగదు. ప్రజల సమస్యను నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లిసీపీఐ మండల కార్యదర్శి కొదురుపాక మహేష్, కిషోర్, జాడి ఖత్రు, నాంచార్ల సత్యనారాయణ, శ్రీరామ్ సుధాకర్, ఏఐవైఎఫ్ నాయకులు వర్కోల్ రాకేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి ఇటాంకర్ తిరుపతి, మండోకర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆఫీసర్స్ కాలనీలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ మహోత్సవం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, పలువురు రాజకీయ నాయకులు




ఎల్బీనగర్, ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గం సాహెబ్‌నగర్ డివిజన్‌లోని ఆఫీసర్స్ కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి ఎల్‌బీనగర్ బీజేపీ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ఫౌండర్, చైర్మన్ గంగం ప్రేమ్‌నాథ్, బీఆర్ఎస్ పార్టీ బీఎన్ రెడ్డినగర్ ఇన్‌చార్జ్ కటికరెడ్డి అరవింద్ రెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న, హైకోర్ట్ కాలనీ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ శ్రవన్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు గౌరిశెట్టి మనోహర్, అనిల్ చౌదరి, సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ రమేష్ నాయక్, శ్రీ సేవాలాల్ బంజారా దళ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్ కోటి నాయక్, గాయత్రి నగర్ ప్రెసిడెంట్ సూర్య నాయక్, వివిధ కాలనీ ప్రెసిడెంట్ లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. **ఆఫీసర్స్ కాలనీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి**ఈ సందర్భంగా ఆఫీసర్స్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన 39, 40 ప్లాట్ల కబ్జా సమస్యను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను ప్రభుత్వ అధికారులతో చర్చించి, పరిష్కారం కోసం తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, ఆఫీసర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో వైభవంగా నిర్వహించారు.

## మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల లో ఉప్పల్ విద్యార్థులకు ఫీజు రాయితీపై మేడ్చల్ ఎమ్మెల్యేతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమావేశం



కాప్రా / ఆగస్టు 10 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి)ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజు రాయితీ కల్పించే అంశంపై ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రివర్యులు మేడ్చల్ ఎమ్మెల్యే చామకుర మల్లారెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించి, వారు ఉన్నత విద్యను కొనసాగించేలా సహకరించాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఉప్పల్ నియోజకవర్గ విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుతోనే ఉంటాం అసంతృప్తి తో ఉన్నారరానేది అవాస్తవం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 10,(విజన్ ఆంధ్రమంచిర్యాల ఎమ్మెల్యే పై కార్పొరేటర్లు అసంతృప్తి తో ఉన్నారనేది అవాస్తవం అని, ప్రాణం ఉన్నంతవరకు ఎమ్మెల్యే తోనే ఉంటామని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్లు స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్ అధ్యక్షతన జరిగిన పాత్రికేయుల సమావేశంలో మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, కార్పొరేటర్లు మాట్లాడారు. తాము ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ని విడిచి వెళ్తామని మాలో అసంతృప్తి ఉందని, తప్పుడు ప్రచారాలు చేయడం తగదని కార్పొరేటర్లు సూచించారు. ఎమ్మెల్యేను విడిచి వెళ్లే ప్రసక్తి లేదని ముక్త కంఠం తో తేల్చిచెప్పారు. మాలో ప్రాణం ఉన్నంత వరకు మేము ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుతోనే ఉంటామని,ఎవరు ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసిన మంచిర్యాల నియోజకవర్గ ప్రజలు నమ్మరని అన్నారు..నియోజకవర్గం లో ఇప్పటివరకు ఎవ్వరు చేయలేని అభివృద్ధి పనులను గెలిచినప్పటినుండి నిర్వీరామంగా చేస్తూ ప్రజల ఆధారాభిమానాలు పొందుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి నీ చూసి ఓర్వలేక కొందరు అవస్తవాలు మాట్లాడటం హేయమైన చర్య అని తిప్పి కొట్టారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ప్రమాదబీమా

హైదరాబాద్,ఆగస్ట్10 : తెలంగాణలోని మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో సుమారు 4.21లక్షల మందికిపైగా మత్స్యకారులకు ఈ బీమా వర్తించనుంది. ప్రమాదవశాత్తు మరణం, వైకల్యం సంభవిస్తే రూ.5లక్షల వరకు బీమా లభించనుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచే బీమా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీమా కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా మత్స్యశాఖ రూ.1.34 కోట్లు చెల్లించింది.

## మిత్రుడు దూరమైన కుటుంబానికి మేమున్నామంటూ

### చిన్ననాటి స్నేహం కష్టకాలంలో ఆర్థిక భరోసా స్నేహానికి చిరునామగా ఆపదలోమిత్రులుకుటుంబానికి అండగాపూర్వవిద్యార్థులు.

నారాయణపేట, ఆగస్టు 10 విజన్ ఆంధ్ర) చిన్ననాటి స్నేహం.. ఒకే తరగతి గదిలో చదువుకున్న అనుబంధం.. కాలం గడిచినా చెదరని ఆత్మీయత.. ఆపద సమయంలో ఆ స్నేహబంధం మరోసారి వెలుగుచూసింది. తమతో కలిసి చదువుకున్న బాల్యమిత్రుడు అనారోగ్యంతో మృతి చెందడంతో అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు పూర్వ విద్యార్థులంతా ఒక్కటై మానవత్వాన్ని చాటుకున్నారు. నారాయణపేట జిల్లాలోని నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన జీడి ప్రకాష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గత వారం రోజుల క్రితం మృతి చెందాడు. ప్రకాష్ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ఆయన చిన్ననాటి మిత్రులు, పూర్వ విద్యార్థులు సోమవారం జాజాపూర్ గ్రామానికి చేరుకుని



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌తో తమకున్న చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలుస్తామని, ఎలాంటి అవసరం వచ్చినా తమకు తెలియజేయాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. స్నేహం అంటే సంతోషాల్లోనే కాదు.. కష్టాల్లోనూ తోడుగా నిలవడమేనని పూర్వ విద్యార్థులు తమ చర్య ద్వారా చాటిచెప్పారు. ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలిచిన పూర్వ విద్యార్థులను గ్రామస్థులు అభినందించారు.

## క్లౌడ్‌తో పేటీఎం పేమెంట్ గేట్‌వే అనుసంధానం

హైదరాబాద్, ఆగస్ట్ 10 (విజన్ ఆంధ్ర): వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్‌కు పూర్తిగా అనుబంధ సంస్థ అయిన పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ లిమిటెడ్(పీపీఎస్ఎల్), ఆంత్రపిక్స్ క్లౌడ్ తో మోడల్ కాంటెస్ట్ ప్రోటోకాల్(ఎంసీపీ) కనెక్టర్ ద్వారా పేటీఎం పేమెంట్ గేట్‌వేను అనుసంధానించినట్లు పేటీఎం పేమెంట్ గేట్‌వే ప్రతినిధులు సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ సదుపాయంతో వ్యాపారాలు ఏఐ ప్రాంప్ట్‌ల ద్వారా లావాదేవీలు, పేమెంట్ లింకులు, రీఫండ్‌లు, సెటిల్‌మెంట్‌లు, సబ్‌స్క్రిప్షన్‌లు, ఆర్డర్ స్థితి, రీకన్సిలియేషన్ వివరాలను సురక్షితంగా పొందవచ్చని తెలిపారు. మర్చంట్ అనుమతుల ఆధారంగా మాత్రమే సమాచారం అందేలా భద్రతా నియంత్రణలు ఉంటాయని తెలిపారు. ఈ అనుసంధానం ఎంఎస్‌ఎంఈలు, పెద్ద సంస్థలు, డెవలపర్లు, ఆర్థిక, కస్టమర్ సపోర్ట్ బృందాలకు చెల్లింపు నిర్వహణను మరింత వేగవంతం చేయనున్నట్లు వెల్లడించారు.

## కుతాడి నర్సింహా చిత్రపటానికి తుంగతుర్తి రవి నివాళులు



బోడుప్పల్,ఆగస్ట్ 10(విజన్ ఆంధ్ర): మేడిపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కుతాడి నర్సింహా దశదిన కర్మ కార్యక్రమాన్ని ఆయన నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింహా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, నర్సింహా మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహ్మా తనయుడు కరణ్‌తో పాటు సాయిలు, కృష్ణ కిషోర్, బర్ల నాగరాజు, సంతోష్, సంపత్, శరత్, కపిల్ తదితరులు పాల్గొన్నారు

## నల్ల పోచమ్మ ఆలయంలో అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు

### ముఖ్యఅతిథిగా శివ నరసింహ శాస్త్రి.. అమ్మవారికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన భక్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకల నిర్వహణ

కాప్రా /ఆగస్టు 9(విజన్ ఆంధ్ర ప్రతినిధి): నాచారం ఇంద్రానగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన శివ నరసింహ శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు జి. చంద్రశేఖర్, కె. అశోక్, జి. విజయలక్ష్మి, కె. సత్యనారాయణ, అధ్యక్షులు బి. చంద్ర మౌళి, ప్రధాన కార్యదర్శి పి. రమేష్ కుమార్, కోశాధికారి బి. బాలయ్య, ఉపాధ్యక్షులు జి. రాజి రెడ్డి, కె. అశోక్, ఆర్. శ్రీశైలం, పి. సురేందర్ స్వామి, ఆర్. శ్రీధర్, కె. నిఖిల్



సాయి పాల్గొన్నారు. సంయుక్త కార్యదర్శులు ఎం. ఉమామహేశ్వర చారి, జి. శేఖర్ గుప్తా, టి. రాకేష్, ఎ. అంజయ్య, కె. విజయ్ కుమార్, వి. సాయి కుమార్, పి. ఇంద్రసేన రెడ్డి, కె. యాదగిరి, నిర్వాహకులు డి. కాళిదాస్, ఎ. శ్యామ్ కుమార్, ఈ. శ్రీను నాయక్, జి. బాలసిద్దులు, పి. రవి కుమార్, పి. రాములు, కె. రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే సభ్యులు పి. ప్రభాకర్, ఆర్. బాలమల్లు, కె. వెంకటేష్, కె. సత్యనారాయణ యాదవ్, కె. శ్రీనివాస్, డి. రాంప్రసాద్, ఆర్. కృష్ణ, జి. శ్రీనివాస్, జె. ప్రభాకర్, ఎం. రవి, ఎ. సుధాకర్, జి. శ్రీనివాస్ (జన), జి. శివ, జి. రమేష్, కె. రవి చారి, వి. గోపాల్, చి. మహేష్, ఎ. ఉప్పలయ్య తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు- సీఐటీయూ

కాప్రా /ఆగస్టు 10( విజన్ ఆంధ్ర ప్రతినిధి) కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సి.ఐ.టి.యు మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జైలు భరో కార్యక్రమమును సి.ఐ.టి.యు కమలానగర్ ఆఫీసు నుండి ఈ సెల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఈసీఐఎల్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పద్మశ్రీ, సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి. సత్యం గారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దేశ సంపదను దోచిపెడుతుందని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడెలను తీసుకొని వచ్చి కార్మికులను కట్టు బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నది అని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమును రద్దుచేసి విబిజి రాంజీ అనే పథకంతో గ్రామీణ పేదల పుట్టగొట్టే దానికి ప్రయత్నం చేస్తున్నది అన్నారు. నూతన విత్తన విధానాన్ని తీసుకొని వచ్చింది అదేవిధంగా నూతన విద్యుత్ విధానము నూతన విద్యా విధానము తీసుకుని వచ్చి



ప్రజల పైన అనేక భారాలు వేసి దానికి ప్రయత్నం చేస్తున్నది అని అన్నారు. అమెరికాతో చేసుకున్న నూతన వాణిజ్య ఒప్పందంతో భారతదేశంలోని రైతులకు మెడకు ఉరి తాళ్లు బిగించినట్లు అవుతుందని అన్నారు. నూతన విద్యుత్ విధానం వలన రైతులకు ఎస్సీ, ఎస్టీల పేద ప్రజలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ స్కీము నుంచి వారిని తొలగించి వారిపైన భారాలు వేసేదానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి విధానాలకు పరోక్షంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని అన్నారు. నూతన లేబర్ కోడలను తెలంగాణ ప్రభుత్వం కూడా అమలు చేసే దానికి ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. కేరళలో ఉన్న గత వామపక్ష ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లను అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేసిన ఏకైక వామపక్ష ప్రభుత్వం కేరళ అని అన్నారు. 1942 ఆగస్టు 9న భారతదేశానికి స్వాతంత్రం కావాలని ఏదైతే క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందో హనీస్ఫూర్తితో ఈరోజు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈరోజు జరిగిన దేశవ్యాప్తంగా జిల్ బరో కార్యక్రమం విజయవంతమైందని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కార్యశక ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు జి శ్రీనివాసులు జిల్లా కోశాధికారి పి గణేష్ జిల్లా కమిటీ సభ్యులు మణికంఠ,ఐద్వ జిల్లా అధ్యక్షురాలు సృజన తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్ కే ఉన్నికృష్ణ కే శోభారాణి, రేవతి కళ్యాణి,రమేష్ నాయకులు, చింతల యాదయ్య,సబిత లక్ష్మణ్, వెంకన్న,టి.రవీందర్ రెడ్డి,టీ. నరసింహ, కే బాలరాజు, సంతోష్, ఆదామ్, పి.శ్రీనివాస్, నర్సింగరావు, రాంబాబు, శ్రీమన్నారాయణ, శివన్నారాయణ, జయరాజు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్‌గా మీలా మహదేవ్ ఏకగ్రీవ ఎన్నిక



సూర్యాపేట ఆగస్టు 10:(విజన్ ఆంధ్ర)లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం లయన్స్ ఐ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి మొరిశెట్టి లక్షాధి, సహాయ ఎన్నికల అధికారులు యాద కిరణ్, గుడిపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. చైర్మన్‌గా మీలా మహదేవ్ పేరును దోసపాటి గోపాల్ ప్రతిపాదించగా, గుడిపూడి వెంకటేశ్వరరావు బలపరిచారు. దీంతో మీలా మహదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ హాజరై నూతన చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. లయన్స్ ఐ హాస్పిటల్ ద్వారా పేద ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు మరింత విస్తృతంగా అందించాలని వారు ఆకాంక్షించారు. నూతన కార్యవర్గం: కార్యదర్శిగా పెండెం చంద్రశేఖర్, కోశాధికారిగా చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తోట శ్యామ్‌ప్రసాద్, కక్కిరేణి చంద్రశేఖర్, పోలబోయిన నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా మిర్యాల సుధాకర్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా నూక వెంకటేశం గుప్తా, ఈగ దయాకర్, పటేల్ నరసింహారెడ్డి, భువనగిరి భాస్కర్, ఆరే సురేష్‌రెడ్డి, కుమ్మరికుంట్ల లింగయ్య, బెలిదే అంజయ్య, రామదుగు ధర్మారావు, చల్లా లక్ష్మీకాంత్, రాచకొండ శ్రీనివాస్, మట్టపల్లి రాధాకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ లయన్స్ ఐ హాస్పిటల్ అభివృద్ధికి, పేద ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రి సేవలను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్, ఆగస్టు 10 :(విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను, పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.

# విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు కార్మికుడు మృతి



పెంచికల్‌పేట్, ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర): పెంచికల్‌పేట్ మండలం గొంట్లపేట మొట్లగూడ బస్టాండ్ సమీపంలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనుల్లో పాల్గొంటున్న చందు అనే కాంట్రాక్టు కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సమాచారం ప్రకారం, విద్యుత్ లైన్‌పై మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించడంతో చందుకు తీవ్ర షాక్ తగిలింది. దీంతో ఆయన ఎత్తు నుంచి కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనను గమనించిన సహచర కార్మికులు, స్థానికులు వెంటనే అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చందు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలు అక్కడున్న వారిని కలచివేశాయి. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ఎలా జరిగింది? భద్రతా నిబంధనలు పాటించారా? విద్యుత్ సరఫరా నిలిపివేసిన తర్వాతే పనులు చేపట్టారా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.
ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కొంపముంచిన రైతు అతి జాగ్రత్త

**– పొలంలో దాచిన నోట్లకట్టలకు చెద**

**– పనికిరాకుండా పోయిన 5లక్షల నగదు**

జైపూర్,ఆగస్ట్10 : రాజస్థాన్‌లో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఇంట్లో వాళ్లకు తెలియకుండా డబ్బును దాచే ప్రయత్నంలో ఓ రైతు భారీ నష్టాన్ని మూటగట్టుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసమని దాచిన సొమ్ము మట్టిపాలు కావడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో కూరుకుపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, పచ్‌పాద్రాకు చెందిన రైతు మంగీలాల్ మేఘ్వాల్ ఏడాది క్రితం కొంత జాగాను విక్రయించగా రూ.5 లక్షలు వచ్చాయి. ఈ డబ్బుతో చిన్న ఇంటిని నిర్మించుకోవాలని మేఘ్వాల్ భావించాడు. అయితే, ఇంత నగదును ఇంట్లో పెడితే ఎవరైనా చోరీ చేసే ప్రమాదం ఉందని భయపడ్డాడు. ఇంట్లో వాళ్లు చేసే వృథా ఖర్చులతో డబ్బు తరిగిపోయే ప్రమాదం ఉందని కూడా అనుకున్నాడు. డబ్బును ఎలా జాగ్రత్త చేయాలా? అని తెగ ఆలోచించిన అతడికి పొలంలో డబ్బును పాతిపెడితే ఎలాంటి ఇబ్బందీ ఉండదని అనిపించింది. దీంతో, ఓ రోజు రాత్రి అతడు కుటుంబసభ్యులకు తెలియకుండా పొలానికి వెళ్లాడు. రూ.5 లక్షలను పాలిథీన్ బ్యాగ్‌లో చుట్టి పొలంలో పాతిపెట్టాడు. ఆ తరువాత కొంతకాలానికి మళ్లీ డబ్బు అవసరం పడింది. కానీ ఆ డబ్బును పాతిపెట్టిన చోటును రైతు మర్చిపోవడంతో చిక్కులు ఎదురయ్యాయి. ఎంత ఆలోచించినా ఆ ప్రదేశం ఏదో గుర్తుకురాలేదు. పొలంలో వెతికినా ప్రయోజనం లేకపోయింది. చివరకు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పగా వారు పొలంలో వెతికి చివరకు నిరాశగా వెనుదిరిగారు. ఇటీవల వర్షాలు పడటంతో ఆ కుటుంబం వ్యవసాయానికి సిద్ధమైంది. ఈ క్రమంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతుండగా డబ్బు కట్టలున్న బ్యాగు బయటపడింది. అయితే, నోట్లకు చెదలు పట్టి చాలా వరకూ పాడైపోవడంతో వారంతా హతాశులయ్యారు. చివరి ప్రయత్నంగా పాత నోట్లను బ్యాంకులో ఇచ్చి కొత్త నోట్లను తెచ్చుకోవాలని ప్రయత్నించారు. అయితే, నోట్లు బాగా పాడైపోవడంతో పచ్‌పాద్రా, బలోత్రాలోని బ్యాంకులు తిరస్కరించాయి. జైపూర్‌లోని బ్యాంకులను సంప్రదించాలని సూచించాయి. డబ్బులో కొంతమొత్తమైనా తిరిగొస్తే బాగుండని రైతు మంగీలాల్ ఆశిస్తున్నాడు. పొలంలో డబ్బు పాతిపెట్టకుండా ఉంటే బాగుండేదని పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు.

# నిరసనల ర్యాలీలకు ప్రజల్లో అనూహ్య స్పందన

**- డీఎస్సీ అక్రమాలపై వైసిపి పోరాటం సక్సెస్**

**- పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి**

అమరావతి,ఆగస్ట్10 : వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని పార్టీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. తాజాగా డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త నిరసన ర్యాలీలు విజయవంతం కావడంతో సజ్జల మీడియాతో మాట్లాడారు. తాము అడిగిన దాంట్లో వాస్తవం లేకపోతే ప్రజల నుంచి ఇంత స్పందన ఎలా వస్తుందని ప్రశ్నించారు. 'వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. నిరసనలపై కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మా పోరాటాలను అణచివేయాలని చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ర్యాలీలు విజయవంతమయ్యాయి. వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రతి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. నిరసన కార్యక్రమాలను ఓ ఉద్యమంలా ముందుకు తీసుకెళు_న్నాం. అందుకే వైఎస్సార్‌సీపీ పోరాటాను అణగదొక్కాలనే ప్రయత్నం చేస్తున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగింది వాస్తవం కాబట్టే చంద్రబాబు ఉలిక్కిపడుతున్నారు. ఈ స్కాం నుంచి చంద్రబాబు, లోకేష్ తప్పించుకోలేరు. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. నిరసనలపై కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటివరకూ ఇవ్వలేదు. మేం అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోంది. డీఎస్సీలో అక్రమాలు జరిగినట్లు క్లియర్‌గా తెలుస్తోంది. ఉన్నతస్థాయిలోనే తప్పు జరిగిందనే విషయం అర్థమవుతోంది. అక్రమాలు జరిగాయి కాబట్టే సీబీఐ విచారణకు భయపడుతున్నారు. లీకేజీ జరిగిందనడానికి తిరుగులేని ఆధారాలున్నాయి ఒక తప్పును కవర్ చేయడానికి తప్పుల మీద తప్పులు చేశారు. అక్రమాలు బయటకు రావడంతో సర్టిఫికెట్లు కూడా టాంపర్ చేసి మార్చారు' అని సజ్జల ధ్వజమెత్తారు.

# రైతుకు అండగా.. వ్యవసాయానికి భరోసాగా రాష్ట్రప్రభుత్వం

**రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం**

**రైతు మేళాలో నేర్చుకున్న కొత్త సాగు పద్ధతులను తోటి రైతులతో పంచుకోవాలి**

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**




హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర)రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. యాసంగి సీజన్‌లో రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని, ధాన్యం కొనుగోలు సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమేనని మంత్రి పేర్కొన్నారు. గతంలో తగిన గోదాముల నిర్మాణం, ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదాముల సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని, రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం ఇదేనని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భూభారతి విధానం ద్వారా భూములకు స్పష్టమైన హక్కులు, టైటిల్, భూ రికార్డులు, మ్యాప్ తదితర వివరాలను అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందించి సమగ్ర భూ సర్వేకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో భూ రికార్డులను క్రమబద్ధీకరించి భవిష్యత్తులో భూ వివాదాలు, ఆక్రమణలు, హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. రాష్ట్రంలోని భూముల యజమానులు సంతృప్తిగా ఉండటమే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వానికి నిజమైన ఆనందమని మంత్రి పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే పంటలను ఎంచుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల సూచనలను రైతుల అనుభవంతో సమన్వయం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతు మేళాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ప్రగతిశీల రైతులు అందించే సూచనలు, నూతన సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, ఆ జ్ఞానాన్ని తోటి రైతులతో పంచుకోవాలని అన్నారు. "శాస్త్రవేత్తలకంటే రైతులే గొప్ప శాస్త్రవేత్తలు. ఎన్నో ఏళ్లుగా నేలను, నీటిని, పంటలను, ప్రకృతిని పరిశీలించిన అనుభవం రైతులకు ఉంది. ఆ అనుభవానికి శాస్త్రీయ పరిజ్ఞానం తోడైతే వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు" అని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ:జిల్లా స్థాయి రైతు మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలు, అనుభవాలను రైతులు సద్వినియోగం చేసుకుని, వ్యవసాయంలో కొత్త విధానాలను అనుసరించి ఉత్పాదకత, ఆదాయాన్ని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, విత్తనాలు, పంటల సాగు విధానాలు, వివిధ ఉత్పత్తుల గురించి రైతులు నిపుణులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆసిఫాబాద్‌లో జైల్ భరో విజయవంతం

ఆసిఫాబాద్, ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపు మేరకు సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జైల్ భరో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరేట్ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం బస్టాండ్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకోను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, నాయకులు పోలీసుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చిన పోలీసులు పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జి కామ్రేడ్ భూపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, సామాన్యప్రజలకు వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని, రైతు రుణమాఫీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి సంవత్సరానికి 100 రోజుల పని హామీని సమర్థవంతంగా అమలు చేయాలని, అంత్యోదయ కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న 35 కిలోల బియ్యాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్



చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలిపివేసి రైతులకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షులు బాలకిషన్, శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, ఐఎఫ్‌టీయూ నాయకులు చాంద్ పాషా, టీయూసీఐ నాయకులు తిరుపతి, ఐద్వా జిల్లా సంయుక్త కార్యదర్శి నంది పద్మతో పాటు మాట్లా రాజు, శంకర్, రాజేశ్వరి, స్వరూప, గంగామణి, జయ, తేకం ప్రభాకర్, మాడవి చంద్రకళ, భీంభాయ్, సంతోష్, బుద్ధ సమ్మయ్య, నవీన, వనిత తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డీఎస్సీ అక్రమాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ నిరసన

**- పలు చోట్ల లాఠీఛార్జీలు చేయడంపై ఆందోళన**

**- ఎక్కడిక్కడే నేతలను అడ్డుకున్న పోలీసులు**

అమరావతి,ఆగస్ట్10 : డీఎస్సీ అక్రమాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు కూటమి ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ర్యాలీలను అడ్డుకోవడం, నేతలను అదుపులోకి తీసుకోవడం.. పలు చోట్ల లాఠీఛార్జీలు చేయడంపై వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. నిరసనలను అడ్డుకోవడం చంద్రబాబు ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడుతున్నారు. డీఎస్సీ నియమకాల్లో జరిగిన అవినీతికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయడం, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ అభ్యర్థులు, డీఎస్సీ సంఘాలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ర్యాలీలు, నిరసనలకు అనుమతి లేదంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. పులివెందులలో పోలీసులు దౌర్జన్యకాండకు పాల్పడ్డారు. పులివెందులలో ఆర్డీవోకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై లాఠీ ఛార్జ్ చేశారు. దీంతో పలువురికి గాయాలు కాగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు వినిపించాయి. అంతకు ముందు.. ఎంపీ అవినాశ్‌రెడ్డికి ర్యాలీ నిర్వహించడానికి వీల్లేదంటూ పోలీసులు నోటీసులు అందించారు. చీపురుపల్లిలో నిర్వహించాల్సిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న సీనియర్ నేత, మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణను పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ పోలీసులు అడ్డుకోవడం సరికాదని బొత్స మండిపడ్డారు. రోడ్డుపైనే ఆయన ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి కొడాలి నానిని గుడివాడ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. డీఎస్సీ అంశంపై నిరసనల్లో పాల్గొనకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ పరిణామంపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఆయన అభిమానులు మండిపడుతున్నారు. అటు రాజమండ్రిలోనూ మాజీ ఎంపీ భరత్ ఆధ్వర్యంలో నిరసనలు జరుగుతుండగా.. పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు. విశాఖపట్నంలోని మారియట్ సెంటర్ వద్ద నిరసనకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. కేకే రాజు సహా పలువురిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. విజయవాడలో దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనుమతి లేదంటూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు బారికేడ్లు దాటేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అవనిగడ్డలోనూ వైఎస్సార్‌సీపీ నేతల నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సమస్యలపై గొంతెత్తే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించింది. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో.. గన్నవరంలో వల్లభనేని వంశీ ఆధ్వర్యంలో ర్యాలీలు జరుగుతున్నాయి. నెల్లూరు, కర్నూల్, అనంతపురం, అవనిగడ్డ. ఇలా పలు చోట్ల వైఎస్సార్‌సీపీ ర్యాలీలు నిర్వహించకుండా పోలీసులు అడ్డుపడుతున్నారు. నిరసన తెలియజేస్తున్న వాళ్లపైకి లాఠీ ప్రయోగిస్తున్నారు. డీఎస్సీ అంశంపై శాంతియుతంగా ర్యాలీలు నిర్వహిస్తే ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, దాన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు.

# ముచ్చుకోట వద్ద ఉద్రిక్త పరిస్థితులు

**- వైకాపా నేతలు పెద్దిరెడ్డి, అనంతల అరెస్ట్**

అనంతపురం,ఆగస్ట్10 : వైఎస్సార్‌సీపీ ఆధర్వ్యంలో డిఎస్సీ అక్రమాలపై పోరాటం ఉధృతమైంది. సోమవారం ఉదయం తాడిపత్రి నియోజకవర్గం ముచ్చుకోట వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాడిపత్రిలో యువత ర్యాలీకి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఏర్పాట్లు చేశారు. అయితే పోలీసులు మాత్రం ఆ ర్యాలీని అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాడిపత్రికి బయల్దేరారు. మార్గమధ్యంలో ముచ్చుకోట వద్ద పోలీసులు ఆయన్ని అడ్డుకోవడంతో.. ఆయన రోడ్డుపైనే బైఠాయించి ఆయన నిరసన తెలియజేశారు. శాంతియుతంగా నిర్వహించే కార్యక్రమాలను ఎలా అడ్డుకుంటారని పోలీసులను పెద్దిరెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు.. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. వైఎస్సార్‌సీపీ ర్యాలీలను అడ్డుకోవడం దుర్మార్గమని ఆరోపించారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ ఎందుకు జరపడం లేదు? మంత్రి లోకేశ్ కనుసన్నల్లోనే డీఎస్సీలో అక్రమాలు జరిగాయి. నైతిక బాధ్యతగా ఆయన రాజీనామా చేయాలని పెద్దిరెడ్డి డిమాండ్ చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు అనంతపురం–తాడిపత్రి హైవేపై బైఠాయించారు. పోలీసుల వ్యవహారశైలిపై నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి కూడా పోలీసుల తీరును తప్పుబట్టారు. శాంతియుత కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా నిరసన ర్యాలీలకు పిలుపునిచ్చింది. ఈ నిరసనల్లో పాల్గొనేందుకు అనంతపురం జిల్లా తాడిపత్రికి వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిలను పోలీసులు ముచ్చుకోట వద్ద అడ్డుకున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ వైకాపా నేతలు అక్కడే బైఠాయించారు. దీంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డిలను అదుపులోకి తీసుకుని పోలీసులు అనంతపురం తరలించారు.

## అమిత్ షా ఎందుకు ముఖం చాటేస్తున్నారు: ఎంపి వంశీకృష్ణ

న్యూఢిల్లీ,ఆగస్ట్10 : పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చించేందుకు మోదీ సర్కార్ ఎందుకు వెనకంజ వేస్తోందని, సభకు రావడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎందుకు భయపడుతున్నారని అంటూ కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఎంపీ వంశీకృష్ణ.. కేంద్రం అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు. చర్చించి పాలన చేయడం కంటే, నియంత్రించడం, శిక్షించడానికే మోదీ సర్కార్ ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. గూగుల్, సోషల్ మీడియా వేదికగా నిరసనలు తెలుపుతున్న యువత (జెన్–జీ) పై ఢిల్లీలో జరిగిన లాఠీచార్జి ఘటనపై అమిత్ షా వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జూలై 20వ తేదీన అసలు ఏం జరిగిందో దేశ ప్రజలకు వివరించాలని, యువతపై దాడులకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.

# అక్రమ ఇసుక తరలింపు భగ్నం..

**- గుండూరు శివారులో ట్రాక్టర్లు పట్టుకున్న కల్వకుర్తి పోలీసులు..**

**- యజమాని, డ్రైవర్ పై కేసు నమోదు..**



**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 10:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కల్వకుర్తి మండలం గుండూరు గ్రామ శివారు నుంచి తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా, గుండూరు శివారులో అనుమానాస్పదంగా వస్తున్న ట్రాక్టర్లను ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో అవి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కల్వకుర్తి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ట్రాక్టర్ యజమాని మరియు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**- ఎస్ఐ కురుమూర్తి హెచ్చరిక**

ఈ సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ మండలంలో ఎక్కడా అక్రమ ఇసుక తరలింపుకు అవకాశం ఇవ్వబోము. 24 గంటలు గస్తీ నిర్వహిస్తున్నాం. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

**- ప్రభుత్వ ఆదాయానికి గండి**


అక్రమ ఇసుక తరలింపు వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం నష్టపోతుందని, పర్యావరణానికి కూడా హాని జరుగుతుందని అధికారులు చెప్తున్నారు. దీన్ని అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

# ఢిల్లీ కేంద్రంగా తెలంగాణ ప్రజలపై నకిలీ కాల్ సెంటర్ల దందా

**- బజాజ్ ఫైనాన్స్ పేరుతో లోన్ మోసం..**

**- 21 మంది అరెస్ట్..**

**- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కు చిక్కిన ముఠా...**







**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 10:** తెలంగాణ ప్రజలను ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుని ఢిల్లీ కేంద్రంగా భారీ ఎత్తున సాగుతున్న నకిలీ కాల్ సెంటర్ల ముఠాను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుట్టు రట్టు చేశారు. ఢిల్లీలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఈ నకిలీ కాల్ సెంటర్లపై దాడులు చేసి 21 మంది మహిళా టెలీకాలర్లతో పాటు ఒక బ్యాంకు ఖాతాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా ప్రముఖ ఫైనాన్స్ సంస్థ బజాజ్ ఫైనాన్స్ పేరు ను దుర్వినియోగం చేసి తెలంగాణ ప్రజలకు ఫోన్లు చేస్తుండేది. మేము తక్కువ వడ్డీకి తక్షణ లోన్ ఇప్పిస్తామని, ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయని నమ్మించేవారు. లోన్ కావాలని ఆసక్తి చూపిన వారిని తమ వలలో వేసుకునేవారు. ముందుగా లోన్ ప్రాసెసింగ్ ఫీజు కట్టాలని చెప్పి డబ్బులు తీసుకునేవారు. ఆ తర్వాత వెరిఫికేషన్ ఛార్జీలు, డాక్యుమెంటేషన్ ఖర్చులు, ఇన్సూరెన్స్ పేరుతో మళ్లీ మళ్లీ డబ్బులు డిమాండ్ చేసేవారు. బాధితులు డబ్బు చెల్లించిన వెంటనే వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి మాయమయ్యేవారు. ఈ విధంగా ఇప్పటికే పలువురిని మోసం చేసి లక్షల రూపాయలు కొల్లగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అయిన 21 మంది మహిళలు ఈ కాల్ సెంటర్లలో టెలీకాలర్లుగా పనిచేస్తున్నారు. వీరు స్క్రిప్ట్ ప్రకారం మాట్లాడి ప్రజలను నమ్మించేవారు. మోసం చేసిన డబ్బును వేర్వేరు బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించేవారు. ఆ ఖాతాదారుడిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు ప్రధాన సూత్రధారులుగా ఉన్న కొందరు మాత్రం పోలీసుల దాడి సమాచారం అందుకుని ముందుగానే పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ ఘటనపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రజలకు తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఏ బ్యాంకు గానీ, ఏ ఫైనాన్స్ సంస్థ గానీ లోన్ మంజూరు చేయడానికి ముందు ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్ లేదా ఇతర ఛార్జీల పేరుతో డబ్బులు అడగదని స్పష్టం చేసింది. ఎవరైనా ఫోన్ చేసి ముందుగా డబ్బు కట్టాలని అడిగితే అది 100 శాతం మోసమేనని గుర్తించాలని సూచించింది. అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత బ్యాంకు యొక్క అధికారిక బ్రాంచ్ కు నేరుగా వెళ్లి లేదా అధికారిక కస్టమర్ కేర్ నంబర్ ద్వారా వివరాలు నిర్ధారించుకోవాలని తెలిపింది. ఇప్పటికే ఇలాంటి మోసానికి గురైన వారు వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ కు కాల్ చేయాలని లేదా ఞఎవతీఞతీఱఎవ.ౖశీజ.ఱఅ వెబ్‌సైట్ లో ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఫోన్ లో వచ్చే లోన్ ఆఫర్లను నమ్మి మోసపోకండి.

## రెంట్ బాయ్‌ఫ్రెండ్‌తో జరాభద్రం






హైదరాబాద్, ఆగస్టు 10 : సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. సోషల్ మీడియాలో జరుగుతున్న మరో మోసంపై యువతను అప్రమత్తం చేశారు. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో నెట్టింట జరుగుతున్న ప్రచారం వెనుక ఉన్న మోసాలను వివరిస్తూ అమ్మాయిలు, యువతులను అలర్ట్ చేశారు. ఆకర్షణీయమైన కుర్రాళ్ల ఫోటోలు పెట్టి, అమ్మాయిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇలాంటి కేటుగాళ్ల వలలో పడొద్దంటూ హెచ్చరించారు. ఇలాంటి మోసాలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియాలో జరిగే మోసాల నుంచి సైబర్ నేరాల వరకూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్. ముఖ్యంగా యువతీ, యువకులు మోసాలకు గురికాకుండా సోషల్ మీడియా ద్వారావారిని అలర్ట్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే రెంట్ బాయ్‌ఫ్రెండ్ పేరుతో నెట్టింట జరుగుతున్న మోసాలపై మరోసారి యువతను అప్రమత్తం చేశారాయన. ఆగస్ట్ నెలలో రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు వల వేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. అలర్ట్‌గా ఉండాలని అమ్మాయిలకు సూచించారు.ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అది కూడా 50 శాతం ఆఫర్లతో అంటూ సోషల్ మీడియాలో కలర్‌ఫుల్‌గా కనిపించే పోస్టర్ల వెనుక సైబర్ మోసం దాగి ఉందని.. అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళు విసురుతున్న కొత్త డేటింగ్ ట్రాప్ ఇదంటూ సజ్జనార్ హెచ్చరించారు. ఫేస్ బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లోఆకర్షణీయంగా ఉండే అబ్బాయిల ఫోటోలను చూపిస్తూ.. కాఫీ మీటింగ్, సినిమా డేట్, షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లు, ఫుల్ డే ప్యాకేజీ అంటూ కేటుగాళ్లు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. గోప్యత, భద్రత పాటిస్తామని, అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతూ నెట్టింట ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ వివరించారు."ఏఐతో సృష్టించిన, ఇంటర్నెట్ నుంచి సేకరించిన అందమైన కుర్రాళ్ల ఫోటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టి, మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలుపెడతారు. బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసి, ఆపై అకౌంట్లను బ్లాక్ చేస్తారు. ఆన్‌లైన్ సంభాషణలు నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది." అని సజ్జనార్ యువతులు, అమ్మాయిలను అప్రమత్తం చేశారు.సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టిసారించిందని.. వీటికి బాధ్యులైన వారిపై వేగంగా దర్యాప్తు చేసి.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటుగా, వారి తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? బయట ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.సోషల్ మీడియాలో ఇలాంటి కేటుగాళ్లు ఇచ్చే డిస్కౌంట్ ఆఫర్లను చూసి మోసపోవద్దని.. అపరిచిత వ్యక్తులతో చాటింగ్, కలవడం కానీ చేయవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి సైబర్ కేటుగాళ్ల బారినపడినా, లేదా అనుమానాస్పద పోస్టులు గమనిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కి కాల్ చేయాలని.. లేదంటే ఇఎఎవతీఇ తీతిఎవ.ఐనీల.తిని పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు.

# బిగ్ ప్లాన్‌లో బీజేపీ



హైదరాబాద్, ఆగస్టు 10 : తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కమలనాథులు, ఈసారి ఎలాగైనా తెలంగాణ గద్దెనెక్కాలనే స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో జరిగిన కీలక సమీక్షా సమావేశం, రాబోయే రోజుల్లో బీజేపీ అనుసరించబోయే రాజకీయ వ్యూహానికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది.తెలంగాణ బీజేపీకి ప్రధాన ప్రతిబంధకంగా మారిన పాత, కొత్త నేతల మధ్య విభేదాలను, అంతర్గత కలహాలను వెంటనే పక్కన పెట్టాలని పార్టీ అధిష్ఠానం స్పష్టం చేసింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ రావు సహా ముఖ్య నేతలందరూ ఒకే తాటిపైకి వచ్చి పోరాడాలని అధిష్టానం స్పష్టం చేసింది. గతంలో కరీంనగర్, మేడ్చల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకంపై నలుగుతున్న వివాదాలను సైతం బండి సంజయ్, ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డిల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ సర్దుబాటు చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఐక్యతను నింపే ప్రయత్నం జరిగింది.భవిష్యత్తులో బిఆర్ఎస్ లేదా ఇతర పార్టీలతో పొత్తులు ఉంటాయనే ప్రచారాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముగింపు పలికారు. రాబోయే ఎన్నికల్లో జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికల్లోనైనా తెలంగాణలో ఏ ఇతర పార్టీతోనూ పొత్తు ఉండదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తేల్చి చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో సమీకరణాలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ స్వయం సమృద్ధి దృష్ట్యా ఒంటరి పోరాటమే శ్రేయస్కరమని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో గణనీయమైన ఓటు బ్యాంకు సాధించామని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం సీట్ల సంఖ్య పెరిగితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత సత్తా సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, యువత సమస్యలపై పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ధర్నాలు, నిరసనలు చేపడుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' వంటి ఫలాలను పేదలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.మండల స్థాయి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ప్రతి నెలా నిలకడగా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించేలా పక్కా ప్రణాళిక రూపుదిద్దుకుంది. నేతల మధ్య ఉన్న చిన్న చిన్న భేదాభిప్రాయాలు పక్కనబెట్టి, వ్యూహాత్మకంగా ముందుకు సాగితే తెలంగాణ పీఠం దక్కడం అసాధ్యమేమీ కాదని కమలనాథులు భావిస్తున్నారు.

### బండి సంజయ్ నివాసంలో సమావేశాలు..

బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాల్లో మరో మలుపు తీసుకుంటూ వ్యూహాత్మకంగా కదులుతోంది. ఒకవైపు వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్, గుజరాత్‌లో గెలుపుపై దృష్టి సారించిన కమలం పార్టీ మరోవైపు దరక్షిణాన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటక తర్వాత గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో పార్టీలో జోష్ పెంచడంతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా వ్యూహాలు రూపొందిస్తోంది. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ పోరులో విజయం సాధించాలనే లక్ష్యంతో కేంద్ర స్థాయి నుంచి స్పష్టమైన దిశానిర్దేశం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీని వేదికగా రాష్ట్ర నాయకుల సమావేశాలు జరగడం, పార్టీలో సమన్వయాన్ని పెంచే ప్రయత్నాలు ఈ వ్యూహానికి ప్రధాన అంశాలుగా మారాయి.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ బలమైన పనితీరు చూపాలనే ఆలోచనతో బీజేపీ అధిష్టానం పని చేస్తోంది. హైదరాబాద్‌లోని మున్సిపల్ ఎన్నికలు పార్టీకి కీలక పరీక్షగా మారనున్న నేపథ్యంలో, రాష్ట్ర స్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలం పెంచే దిశగా చర్చలు సాగుతున్నాయి. కేవలం ఎన్నికల క్యాంపెయిన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ బలాన్ని నిర్మించే దృష్టితో వ్యూహాలు రూపొందుతున్నట్లు అర్థమవుతోంది.ఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం రాష్ట్ర నాయకుల సమావేశాలకు ముఖ్య వేదికగా మారింది. ఇక్కడ జరుగుతున్న చర్చలు కేవలం సాధారణ సమావేశాలుగా కాకుండా, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర నాయకత్వం మధ్య నేరుగా సంప్రదింపులు జరగడం వల్ల సమస్యలను త్వరగా గుర్తించి, పరిష్కార మార్గాలు చర్చించే అవకాశం ఏర్పడుతోంది. ఇది పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించే దిశగా ఉన్నట్లు కనిపిస్తోంది.పార్టీలోని వర్గ విభేదాలను అధిగమించి, ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశం అధిష్టానం నుంచి స్పష్టంగా వస్తోంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధించాలంటే అంతర్గత సమస్యలు అడ్డంకిగా మారకూడదనే అవగాహనతో, నాయకుల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపట్టబడుతున్నాయి. ఇది పార్టీ సంస్థాగత బలాన్ని పెంచి, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవకాశం కలిగిస్తుంది.ఢిల్లీలో జరుగుతున్న ఈ కదలికలు తెలంగాణలో బీజేపీ స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే ప్రయత్నంగా భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు అంతర్గత ఐక్యతను నిర్ధారించుకోవడం, స్పష్టమైన బాధ్యతల పంపిణీ, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం వంటివి ఇప్పుడు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ వ్యూహం ఎంతవరకు ఫలితాలు ఇస్తుందనేది రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాల పనితీరు, ప్రజా స్పందనపై ఆధారపడి ఉంటుంది. అయితే అధిష్టానం స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడం, సమన్వయాన్ని ప్రోత్సహించడం పార్టీకి సానుకూల సంకేతంగా నిలుస్తోంది.మొత్తంమీద ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ చర్చలు, సమావేశాలు తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల లక్ష్యం, అంతర్గత ఐక్యత, సంస్థాగత సమన్వయం ఈ మూడు అంశాలపై దృష్టి సారించి అధిష్టానం ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

### 95 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, ఆగస్టు 10 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటులో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 టీపీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటికే తొలి మోడల్ పాఠశాలగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ఏర్పాటు చేసిన స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా సదుపాయాలు కల్పించారు.తాజాగా మరో 95 పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.928 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో పాఠశాలకు భూమి, భవన పరిమాణం, మౌలిక సదుపాయాలను బట్టి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఖర్చు కానుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపించారు.95 పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతుల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆమోదం అనంతరం ఉత్తర్వులు వెలువడితే టెండర్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా 2027-28 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో టీపీఎస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది.ఈ పాఠశాలలకు అవసరమైన నిధుల్లో 70 శాతం, అంటే సుమారు రూ.650 కోట్లను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణం ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు. విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏఐఐబీ, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారీగా రుణాలు సమీకరించే ప్రణాళికలో భాగంగానే ఈ నిధులను వినియోగించనుంది. రుణం అందడంలో ఆలస్యం ఏర్పడినా పనులు ఆగిపోకుండా రాష్ట్ర నిధులతో తొలిదశ నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ఏఐఐబీ తరఫున కన్సల్టెన్సీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అమలు, మౌలిక సదుపాయాలు, నిర్మాణ ప్రమాణాలపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.టీపీఎస్‌లను కేవలం పాఠశాల భవనాలుగా కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించేలా మౌలిక వసతులు కల్పించనున్నారు. తరగతి గదులతోపాటు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, లైబ్రరీలు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలను కల్పించనున్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, క్రీడా వసతులు, ఉచిత రవాణా వంటి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు.విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడంతోపాటు పాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే అచ్చంపేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు రెండేసి టీపీఎస్‌లు మంజూరు కాగా.. గజ్వేల్‌కు కూడా పాఠశాలను కేటాయించారు. ఆరుట్లలో ప్రారంభమైన తొలి టీపీఎస్ నమూనాగా మిగిలిన పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా 100 టీపీఎస్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచి, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది

# మత సామరస్యానికి ప్రతీకగా కాజీపేట దర్గా - మంత్రి పొంగులేటి

- ప్రేమ, ఐక్యతతోనే దేశాభివృద్ధి: మంత్రి అజారుద్దీన్
- ముందుగా మనుషులం.. ఆ తర్వాతే కులం, మతం: మంత్రి కొండా సురేఖ
- వచ్చే ఉర్సు నాటికి మౌలిక వసతుల అభివృద్ధి పూర్తి : ఎమ్మెల్యే నాయిని..



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 ( విజన్ ఆంధ్ర ): కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల్లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి, ఉర్సు ఉత్సవాల ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ , దేవాదాయ ధర్మాదాయ,అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ , వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , ఎమ్మెల్యేలు ప్రకాశ్ రెడ్డి , కేఆర్ నాగరాజు , ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య , తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, తదితరులు పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రముఖులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల విశిష్టత, మత సామరస్యం, దర్గా అభివృద్ధి, జాయరీన్లకు మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై వారు మాట్లాడారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవులు అనే భేదాలు లేకుండా సర్వమతాల ప్రజలు ఒకే వరుసలో నిలబడి ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో గొప్ప విషయమన్నారు. కాజీపేట దర్గాలో కనిపించిన సర్వమత ఐక్యత తనను ఎంతో సంతోషపరిచిందని తెలిపారు.ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా సాహెబ్, ఆయన బృందాన్ని మంత్రి అభినందించారు. దర్గాకు వచ్చే జాయరీన్ల కోసం అవసరమైన మౌలిక వసతులపై పాషా సాహెబ్, నిర్వాహకులు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.దర్గా అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో సమన్వయం చేసుకుని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు సమగ్రంగా సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. కాజీపేట దర్గా సర్వమతాలకు సంబంధించిన అరుదైన ఆధ్యాత్మిక కేంద్రం కాబట్టి, అవసరమైన నిధులు ఎంతైనా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.వచ్చే ఉర్సు నాటికి అవసరమైన అభివృద్ధి, మౌలిక వసతుల పనులను పూర్తి చేసే బాధ్యతను ఇన్‌చార్జ్ మంత్రిగా తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ దేశానికి ప్రస్తుతం అత్యంత అవసరమైనది ప్రేమ, ఆప్యాయత, ఐక్యత, సోదరభావమన్నారు. ప్రజలంతా కలిసిమెలిసి పనిచేసినప్పుడే సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని తెలిపారు.కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల్లో తెలంగాణకు ప్రతీకగా నిలిచే గంగాజమునా తహజీబ్ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పంజాబ్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వక్తలు, అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు.అందరూ కులమత భేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉండాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగితే అల్లాహ్ ఆశీస్సులు, దీవెనలు లభిస్తాయని అన్నారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ అంటేనే మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీక అన్నారు. హైదరాబాద్‌లో కనిపించే మత సామరస్య వాతావరణం మాదిరిగానే కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల్లో కూడా వందల సంవత్సరాలుగా కులమత భేదాలు లేకుండా అందరూ కలిసి పాల్గొంటున్నారని తెలిపారు.ముందుగా మనం మనుషులం.. ఆ తర్వాతే కులం, మతం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. మతం, కులం పేరుతో విభేదాలను పెంచుకుంటే రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం కష్టమవుతుందని చెప్పారు. అందుకే విభేదాలకు అవకాశం ఇవ్వకుండా మత సామరస్యంతో, సోదరభావంతో అందరూ కలిసి మెలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా సాహెబ్, నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, దర్గా నిర్వాహకులు సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఉర్సు ఉత్సవాలకు నెల రోజుల ముందుగానే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి, దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా సాహెబ్, నిర్వాహకులు, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పూర్తి చేశామని చెప్పారు. నీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఉర్సు సందర్భంగా దర్గాకు వచ్చే భక్తుల కోసం సుమారు ₹40 లక్షలతో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కాజీపేట దర్గాకు జాయరీన్లు వస్తున్నారని, వారికి ఉచిత భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారని తెలిపారు. దర్గా అభివృద్ధికి సంబంధించి సుమారు ఏడాదిన్నర క్రితం ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు అందించామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని ఎమ్మెల్యే తెలిపారు. దాదాపు అన్ని ప్రతిపాదనలు తుది దశకు చేరుకున్నాయని, అవి అమలైతే దర్గాకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

## సర్వమత ఐక్యతకు వేదికగా ఉర్సు ఉత్సవాలు

కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా సర్వమత ఐక్యత, మానవత్వం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయని సభలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. దర్గా అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, భక్తులు, జాయరీన్లకు అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరిచేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా సాహెబ్, నిర్వాహకులు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగారపు రవీందర్ మరియు జిల్లా నాయకులు మట్టెడ కుమార్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. వయా పాకిస్థాన్..!




న్యూఢిల్లీ, ఆగస్టు 10 : రష్యా నుంచి భారత్‌కు రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆ దేశ ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ప్రతిపాదించారు. ఈ మార్గం తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా సాగి హిందూ మహాసముద్రానికి చేరుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో అనుసంధానమయ్యే ఏ మార్గమైనా పరిశీలించేందుకు అనుకూలమేనని స్పష్టం చేశారు. బోస్ఫరస్, హర్మూజ్ జలసంధుల వద్ద ఎదురయ్యే భద్రతా, వాణిజ్యపరమైన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ భూభాగ మార్గాల అవసరం పెరుగుతోందని రష్యా భావిస్తోంది.రష్యా నుంచి భారత్‌కు రైలులో సరుకు రవాణా చేసే మార్గం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని కీలక సముద్ర వాణిజ్య మార్గాల్లో అనిశ్చిత




పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో.. సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయంగా భారీ రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేసే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తోంది. రష్యా ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ఈ ప్రతిపాదనను ప్రస్తావించారు. రష్యా నుంచి హిందూ మహాసముద్రం వరకు రైల్వే లింక్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆయన సూచించారు. తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా ఈ రైల్వే మార్గాన్ని తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్‌కు చేరుకునే అవకాశం కల్పించే ఏ రూట్ అయినా తమకు పరిశీలనీయమేనని పేర్కొన్నారు.బోస్ఫరస్, హోర్ముజ్ జలసంధులపై ఆధారపడే అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు భద్రతాపరమైన ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో రష్యా ఈ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు నాలుగో వంతు, ప్రపంచ ఎల్‌ఎన్‌జీ సరఫరాల్లో దాదాపు ఐదో వంతు ఈ ప్రాంతం గుండా సాగుతుందని అంచనా. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది.ఇటీవలి కాలంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు పెరగడంతో హర్మూజ్ జలసంధి ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో సముద్ర మార్గాల్లో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అవసరమని రష్యా భావిస్తోంది. రష్యా ప్రతిపాదనల ప్రకారం సాధ్యమైన రైల్వే కారిడార్ తుర్క్‌మెనిస్తాన్ నుంచి ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా హిందూ మహాసముద్రంకు చేరేలా ఉండనుంది. ఈ మార్గం పూర్తిగా అమలులోకి వస్తే రష్యాకు సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని కొంత మేర తగ్గించే అవకాశం ఉంటుంది.ముఖ్యంగా భారత్‌తో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ తరహా భూభాగ రవాణా మార్గం ఉపయోగపడే అవకాశం ఉందని రష్యా భావిస్తోంది. అయితే ప్రతిపాదిత మార్గంలో ఉన్న దేశాల భౌగోళిక, భద్రతా, రాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు వంటి అనేక అంశాలు ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను ప్రభావితం చేయనున్నాయి.రష్యా చేస్తున్న ప్రతిపాదనలో భారత్‌కు అనుసంధానం కల్పించే మార్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం కనిపిస్తోంది. భారత్‌కు చేరుకునే అవకాశం ఉన్న ఏ రూట్ అయినా పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా ఉప ప్రధాని పేర్కొనడం దీనికి సంకేతంగా భావిస్తున్నారు. ఇలాంటి రైల్వే కారిడార్ అందుబాటులోకి వస్తే రష్యా-భారత్ మధ్య సరుకు రవాణాకు కొత్త మార్గం ఏర్పడే అవకాశం ఉంటుంది. సముద్ర రవాణాలో అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో ప్రత్యామ్నాయ మార్గంగా ఇది ఉపయోగపడవచ్చు. అయితే ఇది ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. మార్గం ఖరారు, నిర్మాణ వ్యయం, దేశాల మధ్య ఒప్పందాలు, భద్రతా అంశాలు వంటి అనేక దశలను దాటాల్సి ఉంటుంది.మొత్తంగా చూస్తే.. సముద్ర వాణిజ్య మార్గాల్లో పెరుగుతున్న భద్రతా సవాళ్లకు ప్రత్యామ్నాయంగా రష్యా భూభాగ రవాణా మార్గాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. రష్యా నుంచి హిందూ మహాసముద్రం, అక్కడి నుంచి భారత్‌తో కనెక్టివిటీ సాధ్యమైతే.. భవిష్యత్తులో రెండు దేశాల వాణిజ్య సంబంధాలకు ఇది కీలకమైన కొత్త మార్గంగా మారే అవకాశం ఉంది.

# ఇంటర్-జోన్ టీ-10 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మల్కాజిగిరి, ఆగస్ట్ 10, (విజన్ ఆంధ్ర): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగం గా ఆర్‌కే పురం ఆఫీసర్స్ కాలనీలో అండర్-18 పిల్లల కోసం సోమవారం ఇంటర్ జోన్ టీ-10 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు ఆర్.ఆర్. మహాపాత్ర మాట్లాడుతూ, 2023 జనవరిలో తాను అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, కాలనీ కమిటీ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టటం జరిగింద న్నారు. కాలనీ పార్కు సంరక్షణ, అభివృద్ధి తన ప్రధాన ప్రాధాన్యతలలో ఒకటిగా మిగిలిపోయిందని తెలిపారు. పార్క్ నంబర్ 1కి సంబంధించి దాదాపు 16 ఏళ్ల న్యాయ పోరాటం తర్వాత కాలనీ వాసులకు అనుకూలంగా ఇటీవల తెలంగాణ హైకోర్టు అనుకూలమైన.తీర్పు ఇచ్చిందన్నారు. కాలనీలో పిల్లల మధ్య క్రీడలు, ఐక్యత, ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి, టోర్నమెంట్ కోసం కాలనీని నాలుగు జోన్‌లుగా విభజించామని చెప్పారు. ఆకుపచ్చ, నారింజ, నీలం పసుపు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలు వల్ల సమిష్టి కృషి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకుంటూనే యువకులకు క్రికెట్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. విజేత జట్టుకు రోలింగ్ ట్రోఫీని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అందజేస్తానని ఆయన వెల్లడించారు. పరిశుభ్రత, పచ్చదనం, క్రీడలలో పాల్గొనడం, కాలనీ కార్యకలాపాలలో పాల్గొనడం,అందరి సహకారంతో ముందుకు వెళతామన్నారు. పనితీరు ఆధారంగా ఉత్తమ జోన్ అవార్డు కూడా అందించ నున్నట్లు ఆయన చెప్పారు ఈ టోర్నమెంట్ యువ తరంలో క్రీడలు, సమాజ స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఈ టోర్నమెంట్ లో పాల్గొనే వారికి, ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులు, వాలంటీర్లు కమిటీ సభ్యులందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్. శ్రీనివాస్ యాదవ్, డీ కే సింగ్, ఎస్. పెరుమాళ్, మోహన్ యాదవ్, రమేష్ యాదవ్, అభిజీత్ భట్టా చార్జీ మధుసూదన్, సునీ ల్ కుమార్ ఝా, దేవకీ తారా, గౌరీ ప్రియ, అల్లు నాగ ప్రసాద్, నరేందర్ శర్మ, సుభాష్ సింగ్, ఉమాచౌదరి, ఆల్ ఫ్రెడ్ రాజు, ఖుషీ రామ్ అగర్వాల్,దీపక్ అగర్వాల్, సతీష్ రావు, లలిత్ అగ ర్వాల్, సతీష్ రావు, డాక్టర్ కన్వల్జిత్ సింగ్, డాక్టర్ ఇంద్రజిత్ గులాటి, గోపు రమణారెడ్డి, పండిట్. అవ దేశ్ మిశ్రా, గంగాధర్, అక్షయ్ పాండా, కల్నల్ వీ. ఎస్. మకర్, కల్నల్ ప్రవీణ్ బాబు కల్నల్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు

## కర్రెగుట్టలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

# అభివృద్ధికి సువర్ణాధ్యాయానికి నాంది

హింసకు స్వస్తి.. సమాజంలో భాగస్వామ్యం కావాలి - డీజీపీ పిలుపు



ములుగు ఆగస్ట్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ-ఆంధ్ర-ఛత్తీస్గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో శాంతి, అభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఆపరేషన్ కగార్ తో మావోయిస్టుల కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు రహదారులు, పునరావాస కార్యక్రమాలతో అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా సీవీ ఆనంద్ సోమవారం కర్రెగుట్టల్లో పర్యటించారు. ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్న ఆయన, సోమవారం ఉదయం పామునూరు 39వ సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపును సందర్శించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం పామునూరు, చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28 కి.మీ మేర నిర్మించిన రహదారిని పరిశీలించారు. అక్కడ జెండా ఎగురవేసి శాంతి కపోతాలను గాల్లోకి వదిలారు. రహదారి పనుల్లో అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పామునూరులోని గుత్తికోయలకు బియ్యం, దుప్పట్లు అందజేసి వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### పునరావాసంతో భారీగా లొంగుబాట్లు

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేసి మావోయిస్టు కంచుకోటలను ఖాళీ చేయించామని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పునరావాస విధానాలతో భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. ఇప్పటికే 23 మంది సరెండర్ అయిన మావోయిస్టులకు దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. సరెండర్ అయిన వారికి ఉపాధి, శిక్షణ, రుణాలు, ఆరోగ్య రక్షణ కార్డులు అందజేస్తున్నామన్నారు.

### 40 ఏళ్ల తర్వాత జనజీవన స్రవంతిలోకి కాకర్ల సమత

దాదాపు 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సీపీఐ మావోయిస్టు సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ సమతకు రూ.20 లక్షల రూపాయల చెక్ అందజేశారు.1985లో వైజాగ్ ప్రాంతం నుంచి అండర్ గ్రౌండ్ లోకి వెళ్లిన సమత హైదరాబాద్, నల్లమల, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక కమిటీల్లో పనిచేశారు. పార్టీ డాక్యుమెంటేషన్, సిద్ధాంత రచనలో కీలకంగా వ్యవహరించారు. జనరల్ సెక్రటరీ గణపతికి సీసీ స్టాఫ్ మెంబర్ గా కూడా పనిచేశారు. ఆమె భర్త పటేల్ సుధాకర్ రెడ్డి 2010లో ఎన్ కౌంటర్ లో మృతి చెందారు. గణపతి దంపతులకు లొంగిపోవాలని పిలుపు మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఆయన భార్యతో పాటు అండర్ గ్రౌండ్ లో ఉన్న సీనియర్ నాయకత్వం హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు."మావోయిస్టులు హింసను వీడి సమాజంలో భాగస్వాములు కావాలి. సరెండర్ అయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది" అని డీజీపీ స్పష్టం చేశారు. త్వరలో ఈ ప్రాంతాన్ని అటవీశాఖతో కలిసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### పర్యటనలో పాల్గొన్నవారు:

ఈ పర్యటనలో మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, సీఆర్పీఎఫ్ ఏడీజీ విక్రమ్ సింగ్, ఇంటెలిజెన్స్ ఎస్పీ సింధు శర్మ, ములుగు కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, డీఎఫ్ఓ వికాస్ మీనా, ఏఎస్పీ మనన్ భట్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- ఈ నెల 15న సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- సభాస్థలి, హెలిపాడ్ ను పరిశీలించిన జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు :10( విజన్ ఆంధ్ర ): ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి కి రానున్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి లో అధికారికంగా ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను, అంబేద్కర్ స్టేడియంలోని బహిరంగ సభ స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తో కలిసి పరిశీలించారు. అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అరకొరగా మాత్రమే రేషన్ కార్డులు అందాయని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి 5 లక్షల మందికి నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందించబోతున్నామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట కు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.ఇది ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంగారెడ్డి గడ్డపై ఘన స్వాగతం పలుకుతామని జగ్గారెడ్డి తెలిపారు. సుమారు 50 వేల మంది జనసమీకరణతో ఈ బహిరంగ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# 12 వేల 500 కోట్ల కలెక్షన్స్ తో స్పైడర్ మ్యాన్

ముంబై, ఆగస్టు 10 : హాలీవుడ్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్ : బ్రాండ్ న్యూ డే' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా వీక్ డేస్‌లోనే సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇప్పటివరకూ వరల్డ్ వైడ్‌గా వి1.31 బిలియన్ డాలర్లకు (ఇండియన్ కరెన్సీలో రూ.12,300 కోట్లకు పైగా కలెక్షన్స్) పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ఇండియాలో ఇప్పటివరకూ రూ.400 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ మూవీ ఓటీటీపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.థియేట్రికల్ రన్ తర్వాత స్పైడర్ మ్యాన్ లేటెస్ట్ మూవీ ఇంటర్నేషనల్ ఓటీటీ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లిష్‌తో పాటు తెలుగు సహా ఇతర భాషల్లోనూ అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. సెప్టెంబర్ లాస్ట్ వీక్ లేదా అక్టోబర్ సెకండ్ వీక్‌లో ఓటీటీలో స్ట్రీమ్ అయ్యే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం 'స్పైడర్ మ్యాన్ : నో వే హోమ్' జియో హాట్ స్టార్‌లో అందుబాటులో ఉంది. లేటెస్ట్ మూవీ ఈ ఓటీటీలోనూ వచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది. ఈ మూవీకి డెస్టిన్ డేనియల్ క్రెట్టన్ దర్శకత్వం వహించగా... టామ్ హాలండ్ స్పైడర్ మ్యాన్‌గా నటించాడు. అతనికి జోడీగా జెండయా నటించారు. జాకబ్ బాటలన్, సాడీ సింక్, జాన్ బెర్నాల్, మార్క్ రుఫలో, మైఖేల్ మాండో తదితరులు కీలకపాత్రలు పోషించారు. సోనీ పిక్చర్స్ ఎంటర్టైన్మెంట్స్ ఇండియా బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మించారు.పీటర్ పార్కర్ (టామ్ హాలండ్) ఎవరనేది ప్రపంచం మర్చిపోవడంతో స్నేహితులు, ప్రియురాలు అందరికీ దూరంగా ఉంటూ ఒంటరి జీవితాన్ని గడుపుతుంటాడు. న్యూయార్క్‌లో జరగబోయే నేరాలను తన ట్రాకింగ్ సిస్టమ్‌తో ముందే పసిగట్టి వాటిని అడ్డుకుంటూ నేరస్థులను చట్టానికి అప్పగిస్తూ... ఓ ఫ్రెండ్లీ స్పైడర్ మ్యాన్‌గా వ్యవహరిస్తుంటాడు. సరిగ్గా అదే టైంలో స్పైడర్ మ్యాన్ శరీరంలో ఊహించని మార్పులు జరుగుతుంటాయి.హార్మోన్ల ప్రతిస్పందన తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు పడుతూ ఉంటాడు. మరోవైపు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్యామేజ్ కంట్రోల్‌పై ఓ అదృశ్య శక్తి దాడులు చేస్తూ వీ మ్యాక్స్ కోసం వెతుకుతూ ఉంటుంది. అసలు డీసీసీపై దాడి చేస్తున్న ఆ అదృశ్య శక్తి ఏంటి? వి మ్యాక్స్ అంటే ఏంటి? ఆ శక్తిని ఎదుర్కొనేందుకు స్పైడర్ మ్యాన్ ఏం చేశాడు? ఈ క్రమంలో అతనికి ఎదురైన సవాళ్లేంటి? తన ప్రియురాలికి పీటర్ పార్కర్ ఎలా గుర్తొచ్చాడు? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# భగత్ సింగ్ నగర్ మాల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవం



మల్కాజిగిరి, ఆగస్ట్ 10,(విజన్ ఆంధ్ర): నేరేడ్మెట్ భగత్ సింగ్ నగర్ మాల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ప్రతి ఒక్కరు భళారే అన్నట్టుగా మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బోనాల ఉత్సవం కనుల పండగగా జరిగింది. మాల అభివృద్ధి సంఘం ముందడుగు అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బాబురావు, ట్రెజరర్ రాచమల్ల శంకర్, లతో పాటుగా ఇంకా సంఘం కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ సాంప్రదాయాన్ని తిలకం దిద్దినట్టు చూపించే విధంగా ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా ఎంతో ఆనందంతో ఈ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు

# నేటితో ముగిసిన ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ



అల్వాల్ ,ఆగస్ట్ 10,(విజన్ ఆంధ్ర): ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (సర్) సోమవారంతో ముగిసింది. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో ఇమ్యునరేషన్ పత్రాల సమర్పణ,వాటి డిటిలైజేషన్ ప్రక్రియ గడువుఆగస్టు 10 వ తేదీతో ముగిసిందని అధికారులు తెలిపారు. ఫారాలు సమర్పించని ఓటర్లకు ఇదే ఆఖరి అవకాశం అని అధికారులు స్పష్టం చేశారు. పత్రాలు సమర్పించని వారిని ఓటరు జాబితా నుండి తొలగించే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లెల శివ, కృష్ణ గౌడ, లక్ష్మణ్ రావు, టీవీ భాస్కర్ రాజేందర్,సుదర్శన్ రెడ్డి, భబిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల సౌలభ్యం కోసం పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ

- రాజకీయ పార్టీలతో కలెక్టర్ చర్చ




కరీంనగర్, ఆగస్టు 10 విజన్ ఆంధ్ర : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చిత్రా మిశ్రా కలెక్టరేట్ సమావేశ మందిరంలో చర్చలు నిర్వహించారు. జిల్లాలోని చొప్పదండి, కరీంనగర్, మానకొండూర్, హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాల స్థానాల్లో మార్పులు, పోలింగ్ కేంద్రాల గదుల మార్పు, రెండు పోలింగ్ కేంద్రాలను ఒకే కేంద్రం పరిధిలోకి తీసుకురావడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల సౌలభ్యం దృష్ట్యా పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ సాధారణ ప్రక్రియ అని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నట్లయితే ఆ ఓటర్లను మరో పోలింగ్ కేంద్రం పరిధిలోకి చేరుస్తామని, అలాగే సౌకర్యాలు లేని, శిథిలావస్థలో ఉన్న పోలింగ్ కేంద్రాలను మరోచోటికి మార్చడం, ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను మరో కేంద్రంలో కలపడం వంటి వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల పరిశీలన అనంతరం తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో ప్రత్యేక సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టామని, ఈ ప్రక్రియపై సందేహాల నివృత్తి కోసం ఏర్పాటు చేసిన సహాయ కేంద్రానికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తగు సూచనలు చేశామని తెలిపారు. ప్రత్యేక సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ అడగగా, ప్రక్రియ అంతా సజావుగానే సాగుతున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో జల కుమారి, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన చారి, ఎంఐఎం పార్టీ ప్రతినిధి సయ్యద్ ఇబ్రహీం, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రతినిధి సాతినేని శ్రీనివాస్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు

# కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని అభిమానులు చేపట్టిన పాదయాత్రకు.. ఎమ్మెల్యే కోవా లక్ష్మి సంఘీభావం...




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ వాంకిడి మండల కేంద్రం నుంచి ఎర్రవెల్లిలోని కేసీఆర్ సొంత నివాసం వరకు జాడె తిరుపతి, దుర్గం శంకర్ పాదయాత్ర చేపట్టారు.తెలంగాణలోని ప్రతి సామాజిక వర్గం సంతోషంగా జీవించాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. త్వరలోనే కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పాదయాత్రకు ఎమ్మెల్యే కోవా లక్ష్మి సంఘీభావం తెలిపారు. పాదయాత్ర చేపట్టిన జాడె తిరుపతి, దుర్గం శంకర్‌ను అభినందిస్తూ వారికి మద్దతు ప్రకటించారు,వాంకిడి నుంచి ఎర్రవెల్లి వరకు సాగుతున్న ఈ పాదయాత్రతో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షను ఆయన దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు పాదయాత్రికులు తెలిపారు.

# డాక్టర్ ప్రియాంక అంతిమయాత్రలో మంత్రి జూపల్లి, ఏపీ మంత్రి టీజీ భరత్ నివాళి

అయిజ ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలో నిర్వహించిన డాక్టర్ ప్రియాంక అంతిమ యాత్ర లో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి అశ్రు నయనాల మధ్య నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు.

- నిందితులను కఠినంగా శిక్షించి ఉరితీయాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రిలో జరిగిన ఈ సంఘటన అత్యంత దుర్మార్గమైనది, మానవత్వానికే మచ్చ తెచ్చేలా ఉంది. ఇది ఎంతమాత్రం ప్రమాదం (యాక్సిడెంట్) కాదు, 100% ప్రణాళికాబద్ధంగా చేసిన హత్యే అని, ఈ ఘటనకు కారణమైన నిందితులకు చట్టప్రకారం కఠినమైన ఉరిశిక్ష పడేలా చూస్తామని, ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో కూడా మాట్లాడతానని తెలిపారు.ఘటన గురించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అంత్యక్రియల కార్యక్రమాలు పూర్తయిన తర్వాత మళ్లీ వచ్చి కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం తరఫున పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠినమైన నూతన చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.గద్వాల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే ఉరిశిక్ష వేయాలని, ఐజ మండలానికి చెందిన డాక్టర్ ప్రియాంకను హత్య చేసిన నిందితులను వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి, 2–3 నెలల వ్యవధిలోనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. కేసు విచారణను నెలల తరబడి సాగదీయకుండా త్వరితగతిన న్యాయం చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు







అందించాలని కోరారు. మహిళల భద్రతకు భరోసానిచ్చేలా చట్టాల్లో మార్పులు తెచ్చి, కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. డాక్టర్ ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఏపీ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ డాక్టర్ ప్రియాంక తండ్రి వెంకటేష్ కు ఏపీ ప్రభుత్వం తరఫున 20 లక్షల చెక్కును అందజేశారు. ఏపీ ప్రభుత్వం బాధ్యత కుటుంబానికి అండగా ఉంటుందని, పీజీ కాలేజీలో కట్టిన ఫీజు మొత్తము వారి కుటుంబానికి అందేటట్లు చేస్తామని, హైదరాబాద్ హాస్పిటల్ లో జరిగిన ట్రీట్మెంట్ ఖర్చులు మొత్తం చెల్లిస్తామని, భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు. అనంతరం అయిజ అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పట్టణంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొని ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చి ప్రభుత్వం తరఫున ప్రభుత్వంతో మాట్లాడి బాధిత కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం సంపత్ కుమార్ అయిజ పట్టణ కేంద్రంలో ప్రియాంక కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీ కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ ప్రియాంక కుటుంబం తనకి ఎంతగానో ఎన్నో ఏళ్లుగా చాలా సాన్నిహిత్యమైన కుటుంబమై వారి కుటుంబానికి ఇలాంటి రోజు రావడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఈ కాలంలో ఆడపిల్ల చదువుకోవడమే కష్టంగా మారిన పరిస్థితుల్లో చేతికిందిన వైద్య విద్యార్థిని ఇలా చేతిలో మృత్యువాత చెందడమనేది అత్యంత బాధాకరమైన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ శేక్షవలి ఆచారి, అలంపూర్ మార్కెట్ చైర్మన్ దొడ్డప్ప, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ రామచంద్ర రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు, కుర్వపల్లయ్య, ఐజ అఖిలపక్ష సంఘం నాయకులు సహకల ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ ఆంజనేయులు, కుర్ని సంఘం నాయకులు చేనేత సహకార సంఘం నాయకులు, ఎక్లాస్పూర్ గ్రామస్తులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిజెపి పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# గురుపాదయాల చెంత.. '93-94' బ్యాచ్ నమస్కారం!

- అక్షరం నేర్పిన ఒడికి... ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల ప్రాణప్రణామం
- హోదాలు, వయసులు మరిచి జారిపోయిన బాల్యపు జ్ఞాపకాలు
- గురువుల సత్కారం.. భావోద్వేగాల నడుమ ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధరూర్, ఆగస్టు 10 ( విజన్ ఆంధ్ర కరస్పాండెంట్)

అవి బాల్యపు అల్లర్లు మురిసిన రోజులు.. ఆకుపచ్చని నేస్తాలతో నడిచిన మట్టిబాటలు.. గురుదేవుల మందలింపుల వెనుక దాగున్న అపారమైన అనురాగాలు. కాలం తన గమనాన్ని వేగవంతం చేస్తూ ముప్పైమూడు వసంతాలను దాటేసింది. ఉపాధి, ఉద్యోగ, వ్యాపార వ్యాపకాల్లో ఎవరి జీవిత ప్రయాణం వారిదైనా.. తమ భవిష్యత్తుకు పునాది వేసిన బడి ఒడిని, దారి చూపిన గురువుల బాటలను ఆ పూర్వ విద్యార్థులు మరువలేదు. ధరూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 199394 విద్యా




సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాలు, భావోద్వేగాల నడుమ కన్నులపండువగా సాగింది.

**జ్ఞాపకాల తీరంలో.. నాటి నేస్తాలు:**

మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం అనంతరం పాఠశాల ప్రాంగణంలో అడుగుపెట్టిన పూర్వ విద్యార్థులు ఒక్కసారిగా తమ విద్యార్థి దశలోకి జారిపోయారు. ఒక్కో తరగతి గదిని చూస్తూ నాటి ముచ్చట్లను నెమరువేసుకున్నారు. బెంచీలపై పేర్లు చెక్కిన జ్ఞాపకాలు, ఆటపాటల అల్లర్లు, కలిసి పంచుకున్న క్యారేజ్ బాక్సుల తీపి ముచ్చట్లను గుర్తుచేసుకుంటూ పరవశించిపోయారు. వయస్సు, హోదా, సామాజిక వ్యత్యాసాలను పక్కనబెట్టి ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని ఆనందబాష్పాలు రాల్చారు. తమ జీవితాల్లో స్థిరపడటానికి ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ, మార్గదర్శకత్వమే కారణమని స్మరించుకున్నారు. పాదపద్మాలకు ప్రణామాలు: కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పూర్వ ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, విశ్రాంత ఉపాధ్యాయులు విజయ్ బాబు, వెంకటరమణ, శ్రీనివాసరావు, లక్ష్మిరెడ్డి, గురురాజారావులను పూర్వ విద్యార్థులు సాదరంగా ఆహ్వానించారు. గురువుల పాదపద్మాలకు నమస్కరించి, శాలువాలు కప్పి, స్మారక బహుమతులతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రస్తుత హెచ్ఎం నరేష్‌తో కలిసి నాటి రోజులను గుర్తుచేసుకుంటూ కేక్ కట్ చేశారు.

**కాలానికి అతీతం.. ఈ స్నేహబంధం:**

ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. "పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలదొక్కుకోవడమే గురువులకు లభించే అతిపెద్ద గురుదక్షిణ. 33 ఏళ్ల తర్వాత కూడా నేర్చుకున్న విలువలను, బడి అనుబంధాన్ని కాపాడుకోవడం అభినందనీయం" అని భావోద్వేగంతో ఆశీర్వదించారు. చిన్ననాటి స్నేహబంధం కాలానికి, హోదాలకు అతీతమైనదని నిరూపిస్తూ.. ఆత్మీయ ఆలింగనాలు, జ్ఞాపకాల ఫోటోలతో సాగిన ఈ వేడుక ప్రతీ ఒక్కరి మదిలో చెరగని ముద్ర వేసింది.

# ఉద్యమ సహచరుడిగా పెద్ది అనుబంధాన్ని గుర్తుచేసుకున్న హరీశ్‌రావు

- పెద్ది జన్మ ధన్యమైంది.. అలాంటి జనాభిమానాన్ని చూడలేదు
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పెద్ది పేరుతో మెమోరియల్ ఆస్పత్రి
- గద్దె కూల్చినా.. ప్రజల గుండెల్లోంచి పెద్ది జ్ఞాపకాలను చెరపలేరు
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సంస్మరణ సభలో నేతల భావోద్వేగ ప్రసంగాలు




నల్లబెల్లి : ఆగస్టు 10,విజన్ ఆంధ్ర : తెలంగాణ ఉద్యమ సమయంలో నెలల తరబడి కలిసి పనిచేసిన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. ప్రజల కోసం, తెలంగాణ కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన పోరాటాన్ని కొనియాడారు. మాజీ మంత్రి కేటీఆర్ సైతం పెద్ది సుదర్శన్‌రెడ్డికి దక్కిన ప్రజాభిమానాన్ని గుర్తుచేస్తూ.. "పెద్ది జన్మ ధన్యమైంది.. అలాంటి జనాభిమానాన్ని నేను ఎప్పుడూ చూడలేదు" అన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభ సోమవారం నల్లబెల్లిలో భావోద్వేగ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు.. ఉద్యమ సహచరుడిగా, ప్రజా నాయకుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే పెద్ది పేరును మెమోరియల్ ఆస్పత్రికి పెడతామని కేటీఆర్ ప్రకటించారు. పెద్ది విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దెను కూల్చినంత మాత్రాన ప్రజల గుండెల్లో ఆయన జ్ఞాపకాలను చెరపలేరని వ్యాఖ్యానించారు.

**నెలల తరబడి ఒకే ఇంట్లో..**

తెలంగాణ ఉద్యమ సమయంలో పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ఒకే ఇంట్లో ఉంటూ నెలల తరబడి ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నామని హరీశ్‌రావు గుర్తుచేశారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనల్లో కలిసి పాల్గొన్నామని.. అమరవీరుల కోసం పోరాడుతూ లాఠీ దెబ్బలు తిన్నామని చెప్పారు. పెద్ది ఒక నియోజకవర్గానికి



పరిమితమైన నాయకుడు కాదని.. తెలంగాణ ఉద్యమానికి వరంగల్ జిల్లాను అండగా నిలిపిన ఉద్యమ కెరటం అని కొనియాడారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించే సమయంలో తాను ప్రమాదవశాత్తు జారిపడుతుండగా పెద్ది పట్టుకుని కాపాడిన ఘటనను హరీశ్‌రావు గుర్తుచేసుకున్నారు. అనంతరం తనకు యశోద ఆస్పత్రిలో చికిత్స చేయించారని తెలిపారు. "అలాంటి పెద్ది సుదర్శన్‌రెడ్డిని అదే ఆస్పత్రిలో అనారోగ్య పరిస్థితుల్లో చూడాల్సి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు" అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

**రైతుల కోసం రూ.100 కోట్ల అండ**

ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి రైతుల కోసం చేసిన సేవలను హరీశ్‌రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. తుఫాన్‌తో పంటలు



దెబ్బతిన్న సమయంలో నియోజకవర్గ రైతులకు అండగా నిలిచారని తెలిపారు. సుమారు రూ.100 కోట్ల విలువైన వ్యవసాయ పరికరాలు, పంపులు, మోటార్లను రాయితీపై అందించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతులకు సహాయం అందించిన నాయకుడిగా పెద్ది గుర్తుండిపోతారని అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించే తత్వం, రైతుల పట్ల చిత్తశుద్ధి కారణంగానే పెద్ది సుదర్శన్‌రెడ్డి కేసీఆర్‌కు అత్యంత ఇష్టమైన నాయకుల్లో ఒకరిగా నిలిచారని హరీశ్‌రావు చెప్పారు. ప్రజల కోసం, తెలంగాణ కోసం ఆయన చేసిన పోరాటాన్ని ఎప్పటికీ మరిచిపోలేమన్నారు.

**"అలాంటి జనాభిమానాన్ని చూడలేదు"**

కేటీఆర్ మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మ ధన్యమైందన్నారు. ముఖ్యమంత్రులు, ప్రముఖ నాయకులు మరణించినప్పుడు భారీగా ప్రజలు తరలిరావడం చూశామని.. అయితే పెద్ది అంతిమయాత్రలో కనిపించిన జనసందోహం, ప్రజాభిమానాన్ని తాను ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. పెద్దికి చివరి వీడ్కోలు పలికేందుకు ప్రజలు గంటల తరబడి వేచి ఉన్నారని, సుమారు 12 గంటలపాటు ఓపికగా నిలిచి నివాళులర్పించారని గుర్తుచేశారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా పనిచేసిన నాయకుడి అంతిమయాత్రకు ఈ స్థాయిలో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం ఆయనకు ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమన్నారు.

**పెద్ది పేరుతో మెమోరియల్ ఆస్పత్రి**

మరో రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరును మెమోరియల్ ఆస్పత్రికి అధికారికంగా పెట్టేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. "గోదావరి నీళ్లు ప్రవహించినంతకాలం.. ఆస్పత్రిలో పుట్టే ప్రతి బిడ్డలో పెద్ది సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకం ఉండేలా ఆయన పేరు నిలిచిపోతుంది" అని కేటీఆర్ అన్నారు. ప్రజల కోసం పెద్ది చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దెను కూల్చినంత మాత్రాన ఆయనను ప్రజల మనసుల్లోంచి తొలగించలేరని కేటీఆర్ అన్నారు. విగ్రహాలు, గద్దెలు తొలగించవచ్చేమో కానీ.. ప్రజల గుండెల్లో ఉన్న పెద్ది జ్ఞాపకాలను ఎవరూ చెరపలేరని వ్యాఖ్యానించారు. పెద్ది పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేశారని.. అందుకే ఆయన మరణించిన సమయంలో ప్రజలు, అభిమానులు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆయనకు లభించిన అపూర్వమైన ప్రజాభిమానమే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజా జీవితానికి అసలైన గుర్తింపు అని అన్నారు. సంస్మరణ సభలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, శంకర్‌నాయక్, మాలోత్ కవిత, వినయభాస్కర్, చల్లా ధర్మారెడ్డి, బడే నాగజ్యోతి, బండ ప్రకాశ్, ఎర్రల శ్రీనివాస్ తదితర బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ది అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.**



హనుమకొండ, జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 ( విజన్ ఆంధ్ర )): వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. హనుమకొండ లో ప్రముఖ వైద్యులు నరసింగరావు, సుధీర్, రామకృష్ణ, శివకుమార్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇషా హాస్పిటల్ ను ప్రారంభించిన అనంతరం పొంగులేటి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి, అధునాతనమైన టెక్నాలజీ ఉపయోగించి సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులకు అవగాహన కల్పించి తద్వారా ఆరోగ్యవంతమైనటువంటి సమాజాన్ని నిర్మించాలని అన్నారు. అనంతరం హాస్పటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన అధునాతనమైన ల్యాబ్, ఐసీయూ తదితర విభాగాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, డిఎంహెచ్వో డాక్టర్.అప్పయ్య, పెసరు విజయ్ చందర్ రెడ్డి, కాళీ ప్రసాద రావు, వైద్యులు అనిల్, సురేష్, రోహిత్,అరుణ, పద్మావతి నితిన్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బోనాల పండుగకు అంతర్జాతీయ ఖ్యాతి

**- లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందికంటి శ్రీధర్ గౌడ్**



ఎల్బీనగర్, ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర): తెలంగాణ బోనాల పండుగకు అంతర్జాతీయ వ్యాప్తంగా ఎంతో ఖ్యాతిని గడించిందని ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందికంటి శ్రీధర్ గౌడ్ పేర్కొన్నారు. భోనాల పండుగ సందర్భంగా తపోవన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన బోనాల పండుగ ఉత్సవంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్లిపోయారు అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీలకు రూ.29.20 కోట్ల నిధులు

**- మురుగునీటి నిర్వహణ ప్రాజెక్టులకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర) : వనపర్తి, పెబ్బేరు పట్టణాల్లో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.29.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విజ్ఞప్తికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి, ఈ సివరేజ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. కేటాయింపుల వివరాలు వనపర్తి మున్సిపాలిటీ రూ.20 కోట్లు పెబ్బేరు మున్సిపాలిటీ రూ.9.20 కోట్లు ప్రాజెక్టు స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో ఆ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా ఈ ప్రాజెక్టును చేపడతారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇళ్లు, వాణిజ్య సముదాయాల నుంచి వచ్చే మురుగునీటిని శాస్త్రీయంగా సేకరించి, శుద్ధి చేసే వ్యవస్థను అభివృద్ధి చేస్తారు. దీనివల్ల పారిశుధ్యం మెరుగుపడి, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ధన్యవాదాలు మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపేలా నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు.

# మేడారం అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

**- సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి సీతక్క సమీక్ష**



ములుగు ఆగస్టు 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : తాడ్వాయి మేడారం ఆలయంలో చేపట్టిన తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయం వెనుక భాగంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్ స్థలాన్ని పరిశీలించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈవో కార్యాలయ పరిసరాలను కూడా సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలలో ప్రజలు పాల్గొనాలి.


**- సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా పిలుపు**



నల్లబెల్లి : ఆగస్టు 10, విజన్ ఆంధ్ర : గత పన్నేండేళ్ళుగా మోడీ బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తూ కార్పొరేట్ లకు అనుకూలంగా పాలన చేయడానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో సిపిఐ ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేసిందనీ ఈ సభ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి చైతన్యం చేయడం కోసమే వరంగల్ జిల్లాలో ఆగస్టు 9 నుంచి 14 వరకు పాదయాత్ర చేపట్టినట్టు సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా అన్నారు. పాదయాత్రలో భాగంగా నల్లబెల్లి మండలకేంద్రంలో బస్టాండ్ ఆవరణలో జరిగిన సమావేశంలో బాష్ మియా మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం అధిక ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు చెప్పిన ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం తెస్తానని హామీలిచ్చి పన్నేండేళ్ళైనా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ఖాళీగా ఉన్న పది లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం లేదన్నారు.రైతు పంటల కొనుగోలుకు , ఉపాధిహామీ పథకానికి గ్యారెంటీ లేకుండా చేశారన్నారు.గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు ద్రోహం చేస్తున్నారన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీలకు పాల్పడుతూ విద్యార్థుల జీవితాలతో చలగాటాలు పడుతున్నారన్నారు.కార్పోరేట్లకు లక్షల కోట్లు రుణమాఫీలు చేస్తూ ప్రజలపై పన్నులు పెంచడాన్ని సిపిఐ వ్యతికిస్తుందన్నారు.ప్రభుత్వ రంగాలను అంబానీ అదానీలకు కట్టబెట్టే దుశ్చర్యలకు వ్యతిరేకంగా సిపిఐ చేపట్టబోయే ఉద్యమాలలో ప్రజలు పాల్గొనాలన్నారు.అనంతరం మండల కార్యదర్శి పరికికోర్నేలు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్ పనాస ప్రసాద్, కార్యవర్గ సభ్యులు గుండె భద్రి, ఖాద్రీ, శరత్, సువర్ణ,రహేలా,శ్వేత, మున్నీ,జన్ను రాజు, సాంబమూర్తి ఆరెల్లి రవి ,అక్బర్ పాదుషా, ఓర్సు రాజు,మండల సహాయ కార్యదర్శులు మామిండ్ల పెద్ద ఐలయ్య, కడియాల క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భీమన అమావాస్యకు భక్తజన ప్రవాహం!

## పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో 12న మహా పూజలు



ధరూర్ ఆగస్టు 10 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం భీమన అమావాస్య వేడుకలకు సిద్ధమవుతోంది. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 18వ శతాబ్దం నాటి పురాతన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 12న బుధవారం భీమన (అత్తి) అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.

### తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు

అమావాస్య సందర్భంగా బ్రహ్మ ముహూర్తంలోనే స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు, పుష్పాలంకరణ, తమలపాకుల పూజ, అష్టోత్తర నామావళి, ప్రత్యేక అర్చనలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. పీఠాధిపతుల ప్రత్యేక పూజలు వేడుకలకు ఉత్తరాది మఠం పీఠాధిపతులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించను న్నారు. ఉడిపి పాలిమార్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు, శ్రీ 1008 విద్యా రాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు ఉదయం 6 గంటలకు కృష్ణానది దండోదక స్నానం, సంస్థాన ప్రత్యేక పూజలు నిర్వహిం చనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు తులసి పూజ, అర్చనలు, అనంతరం 10.30 గంటల నుంచి రామాయణ ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక చింతనను కలిగించేలా ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పవమాన.. నవగ్రహ హోమాలు భీమన అమావాస్య సందర్భంగా ఆలయంలో పవమాన హోమం, నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహిం చనున్నారు. హోమాలు, ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొనే అవకాశం కల్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొనదలచిన భక్తులు 94408 07109, 9959251123, 9449934567, 9440770020 నంబర్లలో సంప్రదిం చాలని సూచించారు. భక్తులకు మూడు పూటలా అన్నప్రసాదం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారిని దర్శించుకునే ప్రతి భక్తునికి పెద్ద చింతరే వుల ఆంజనేయస్వామి అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా అన్నప్రసాదం అందించ నున్నారు. అదనంగా అల్పాహారం, తాగునీటి వసతిని కూడా కల్పించను న్నారు. తరలిరానున్న భక్తులు పురాతన చరిత్ర, విశిష్ట ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగనున్న భీమన అమావాస్య ప్రత్యేక పూజలకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్య చక్రవర్తి కేశవాచార్యులు కోరారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన ఆకాంక్షించారు.

# పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**- కార్పొరేటర్లు నన్ను వీడి వెళ్తారనడం అవాస్తవం**

**- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 10,(విజన్ ఆంధ్ర ) : రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయడం తో నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని,దరఖాస్తు చేసుకొని ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న వారికి కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. సోమవారం అయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూలై నెలలో నిరుద్యోగులకు శుభవార్త తెలుపుతూ 7,437 పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ లను విడుదల చేయడం జరిగిందన్నారు. మంచిర్యాల జిల్లాకు చెందిన యువత పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తుల ప్రక్రియ కోసం రిటైర్డ్ పోలీస్ అధికారి నాగార్జున స్కానర్ రూపంలో ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు పూర్తి చేసుకోవాలని సూచించారు.. పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్న యువతకు మంచిర్యాల పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఆగస్టు 20వ తేదీ స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి రోజు నుండి మా నాన్న కీ,,శే,, కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు మరియు పుస్తకాలు, అందజేయడం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పిస్తానని అన్నారు.ఈ శిక్షణ రెండు నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు.అదేవిధంగా మంచిర్యాల కాలేజీ రోడ్డులోని పాత వ్యవసాయ మార్కెట్ యాడ్ లో మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించేందుకు హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ (ఇస్కాన్ సంస్థ) ఆధ్వర్యంలో సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ పనులను వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.విద్యార్థుల కోసం ఇంత మంచి కార్యక్రమం మంచిర్యాల నియోజకవర్గానికి ఇచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి ధన్యవాదాలు తెలిపారు. తొలుత టిఫిన్ పంపించడం జరుగుతుందని, ఆ తర్వాత దసరా వరకు మధ్యాహ్న భోజనం పంపిణీ ఉంటుందన్నారు. దసరా తర్వాత చెన్నూర్ లో అమలు చేస్తారన్నారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు మినహా పాఠశాల, జూనియర్ కాలేజ్ విద్యార్థులకు ఈ భోజనం, టిఫిన్ పథకం వర్తిస్తుందని తెలిపారు.కాంగ్రెస్ కార్పొరేటర్ లు తనను విడిచి వెళ్తారనే ప్రచారంలో వాస్తవం లేదని ఎమ్మెల్యే అన్నారు. పార్టీలో విభేదాలు ఉన్నట్లు ప్రజల్లో అపోహ సృష్టించాలనుకునే బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.రేపటి నుంచి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు తాగునీరు సరఫరా చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గజ్జల హేమలత, కార్పొరేటర్లు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐతో కొత్త దారులు.. స్టార్టప్‌లతో ఉపాధి

**- మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలి**

**- ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా..**

**ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి : వి. జగదీశ్వర్ గౌడ్**




శేరిలింగంపల్లి. ఆగస్టు 10 : (విజన్ ఆంధ్ర) : మారుతున్న సాంకేతికతతో యువతకు గతంతో పోలిస్తే ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సాంకేతికత, నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకుని తమ ప్రతిభకు పదును పెట్టాలని సూచించారు. గచ్చిబౌలిలోని డ్రేపర్ స్టార్టప్ హౌస్‌లో నిర్వహించిన 'ఫౌండర్ ఫోర్జ్ఎక్స్‌జర్నీ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎపిసోడ్2)' కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. తాము చదువుకునే రోజుల్లో ఇన్ని అవకాశాలు లేవని.. ఇప్పుడు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని చెప్పారు. ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా కాకుండా.. తమ ఆలోచనలకు వ్యాపార రూపమిచ్చి స్టార్టప్‌లు నెలకొల్పాలని సూచించారు. తద్వారా తాము ఉపాధి పొందడంతోపాటు మరికొందరికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగవచ్చన్నారు. కమ్యూనికేషన్, బృందంగా పనిచేయడం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానానికి ఆచరణాత్మక అనుభవాన్ని జోడించుకోవాలన్నారు. డ్రగ్స్, గుట్కా, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యంపై దృష్టి సారించాలని.. వైఫల్యాలను అనుభవాలుగా మలుచుకుని విజయం సాధించే వరకు పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం ఎంతో కష్టపడుతున్నారని.. యువత సాధించే విజయమే వారి శ్రమకు తగిన ప్రతిఫలమని అన్నారు. విద్య, ఉద్యోగం, భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టమైన దృష్టితో ముందుకు సాగి తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ, మల్లారెడ్డి యూనివర్సిటీలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# కర్రే గుట్టలను సందర్శించిన తెలంగాణ డిజిపి సి వి ఆనంద్.



ములుగు ఆగస్ట్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం: ఉదయం ములుగు జిల్లా వాజేడు మండల కర్రీ గుట్టలను తెలంగాణ డిజిపి సీవీ ఆనంద్ సందర్శించి జెండా వందనం చేశారు.




ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో మాజీ మావోయిస్టులతో సమావేశమైన తెలంగాణ డిజిపి సి వి ఆనంద్ తదితర పోలీసు ఉన్నతాధికారులు.

# నీటిని వేడి చేసి తాగండి జలమండలి మేనేజర్ సునీల్



వినాయక్ నగర్ లో నల్లాల ద్వారా కలుషిత నీటి సరఫరా

మల్కాజిగిరి, ఆగస్ట్ 8,(విజన్ ఆంధ్ర): మౌలాలి సర్కిల్ పరిధిలోని వినాయ క్ నగర్ లో నల్లాల ద్వారా గత పది రోజులుగా కలుషి తమైన నీటి సరఫరా జరు గుతుందని బస్తీవాసులు తెలిపారు. జలమండలి ఆధ్వర్యంలో రోజు విడిచి రోజు సరఫరా జరిగే మంచి నీళ్ళు కలుషితమవుతుండ టంతో, ఇవి తాగిన వాళ్ళు అనారోగ్యాల బారిన పడు తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కలుషితమవు తున్న నీటి సరఫరాకు అడ్డుకట్ట వేసి, స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.




మల్కాజిగిరి, ఆగస్ట్ 10,(విజన్ ఆంధ్ర): వర్షా కాలంలో మంచినీటిని వేడి చేసి తాగాలని జలమండలి మేనేజర్ సునీల్ సూచించారు. విజన్ ఆంధ్ర పత్రికలో ఆదివారం ప్రచురితమైన 'వినాయక్ నగర్ లో నల్లాల ద్వారా కలుషిత నీటి సరఫరా' అనే వార్తకు ఆయన స్పందించారు. తన సిబ్బందితో కలిసి వినాయక్ నగర్ లో పర్యటించి, సమస్యను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండ టంతో పైపులలో మట్టి బయటకు వచ్చి నల్లాల ద్వారా సరఫరా అవుతుంటాయని తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా వహించి ఈ నీటిని వేడి చేసి తాగాలని సూచించారు.

# మల్కాజిగిరిలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**- ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని దర్శించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు**



మల్కాజిగిరి, ఆగస్ట్ 10,(విజన్ ఆంధ్ర): ప్రజలు అందరిపై అమ్మ వారి ఆశీస్సులు ఉండాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా మల్కాజిగిరి మహంకాళి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. అమ్మవారి ప్రత్యేక పూజకు హాజరైన ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మైనంపల్లి హన్మంతరావు మాట్లా డుతూ, తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో బాగా వర్షాలు కురవాలని ప్రజలందరూ సకల సంపదలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్,బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీను, డివిజన్ ప్రెసిడెంట్ జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్,పిట్టల నాగరాజు, వైనాల ప్రవీణ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్,కపిల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్ జిత్ గౌడ్, బాబు సత్యనారాయణ,మోహన్ రాజ్,బాల రాజ్, యాదవ్, సురేష్ సింగ్, పార్థు, నరేం దర్ గౌడ్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా,లింగాపూర్ మండలం

**- కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్ లో సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**- నాసిరకం వస్తువులతో నిర్మించిన పనులు**

**- అమ్మ ఆదర్శ పాఠశాలకుకింద 16,లక్షలు ప్రభుత్వం నిధుల విడుదల**





లింగాపూర్ ఆగస్టు 10(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండలం లోని కస్తూరిబా గాంధీ హాస్టల్ లో బాలికల విద్యాలయంలో విద్యార్థుల కు స్నానం చేయడానికి నీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాదవ్ రమేష్ ఆత్రం అనిల్ కుమార్ సందర్శించి పాఠశాల ఎస్ఓ కు నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలకు కింద ప్రభుత్వం నిధులు విడుదల 16 లక్షలు,చేశారు.నిలువ ఉంచడానికి వాటర్ సెప్టిక్ ట్యాంకునిర్మించారు,1/5ఇంచి పరహరి గోడ,బాత్రూం వరండా లో నాసినం రకం పనులోతోనిర్మించిన పనులు పరిశీలించడం జరిగిందనన్నారు.తదితర పనుల కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే ఈ సమస్యలు తలెత్యాయని అన్నారు. ఈ సమస్య ప్రభుత్వఅదికారుల దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్య తీర్చే విధంగా తోడ్పడతామని తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు మెస్రం బాధిరావ్, చావన్, సునీల్, లకావత్, బాబు, షేక్, చాంద్, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్, ఆగస్టు 10 :( విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను, పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ

## మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్



ఎల్బీనగర్ ఆగస్టు 10 (విజన్ ఆంధ్ర): ప్రాచీనకాలంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలలో బాగానమైనటు వంటి బోనాల పండుగకు ఎంతో గొప్ప చరిత్ర, ప్రతీక ఉందని ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సురాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ తెలిపారు. బోనాల పండుగను పురస్కరించుకుని మన్సూరాబాద్‌లోని సహారా స్టేట్స్, కాచిగూడ, లడ్డుయాదవ్ పలహారం బండి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించనన్నారు.

## పంట మార్పిడితో ప్రయోజనాలు

**- ఎమ్మార్వో సాయి గౌడ్..**



సూర్యాపేట ఆగస్టు 10:(విజన్ ఆంధ్ర) : రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు దిగుబడులను పెంచుకోవచ్చని సూర్యాపేట ఎమ్మార్వో సాయి గౌడ్ సూచించారు.సోమవారం సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామంలో రైతులతో మాట్లాడిన ఆయన పంట మార్పిడి ప్రాధాన్యతను వివరించారు.ఒకే పంటను వరుసగా సాగు చేయడం వల్ల భూసారం తగ్గే అవకాశం ఉందని, వివిధ రకాల పంటలను మారుస్తూ సాగు చేయడం ద్వారా నేలలో పోషకాలు సమతుల్యంగా ఉండేలా చూసుకోవచ్చన్నారు. రైతులు మార్కెట్ డిమాండ్, నీటి లభ్యత, నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు, సాంకేతిక సలహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట మార్పిడిపై రైతులకు మరింత అవగాహన కల్పించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ అధికారి సందీప్, ఏఈఓ ముత్తయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పటాన్ చెరు లో వర్కింగ్ జర్నలిస్టుల టి యు డబ్ల్యూ -(ఐ జె యు) సమావేశం!

**- జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**



సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు:10( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీ యు డబ్ల్యూ- జే ఐజేయూ) పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు రామచంద్రాపూర్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఆర్.అనిల్ కుమార్ ఆదివారం తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా యూనియన్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం, హెల్త్ కార్డుల విషయం కూడా చర్చించనున్నట్లు వెల్లడించారు. ఇంకా మిగిలిపోయిన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్ తో పాటు జాతీయ సభ్యులు, రాష్ట్ర సభ్యులు, రాష్ట్ర కమిటీ నాయకులు హాజరు అవుతున్నారు. జిల్లా కమిటీ నాయకులు, ఈసీ సభ్యులు, టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్, చిన్న మధ్య తరహా పత్రికల సంఘం, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, ప్రెస్ క్లబ్‌ల అధ్యక్షులు కార్యదర్శులు సభ్యులు హాజరుకావాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమమే ఏకైక ఎజెండాగా ఈ సమావేశం జరుగుతున్నందున ప్రతి ఒక్కరు సకాలంలో హాజరు కావాల్సిందిగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

# బడి'బాట'కు కేంద్రం బాసట!!

# సర్కారు బడికి 'కోట్ల' మెరుపులు

**- తెలంగాణ విద్యారంగానికి భారీగా రూ. 1,763 కోట్లు**

**- సమగ్ర శిక్ష నిధులపై కోత**

**- ఈ ఏడాది రూ.230 కోట్లు తక్కువ మంజూరు**

**- డిజిటల్ బాటలో సర్కారు చదువులు**





**హైదరాబాద్, ఆగస్టు 10:** తెలంగాణలో విద్యా వ్యవస్థ రూపురేఖలు మారబోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా కేంద్ర ప్రభుత్వం ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. 202627 ఆర్థిక సంవత్సరానికి గాను 'సమగ్ర శిక్ష' పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి ఏకంగా రూ. 1,763.7 కోట్ల భారీ నిధులను మంజూరు చేస్తూ కేంద్రం ఆమోదముద్ర వేసింది. ఈ నిధులు దేనికోసం?

**మౌలిక వసతుల విప్లవం**

డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక ల్యాబ్‌లు, తాగునీరు, శౌచాలయాలు మరియు మౌలిక వసతుల ఆధునీకరణకు ఈ నిధుల్లో ప్రాధాన్యత లభించనుంది.గుణాత్మక విద్య ఉపాధ్యాయుల నైపుణ్యాల పెంపుదల, నూతన బోధనా పద్ధతులు, డిజిటల్ విద్యను మరింత విస్తరించడం.

**విద్యార్థుల సమగ్ర వికాసం**

కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా క్రీడలు, వృత్తి విద్యా నైపుణ్యాలు మరియు బాలికల విద్యకు ప్రత్యేక ప్రోత్సాహకాలు. పాఠశాలల్లో మారనున్న దృశ్యం! తరగతి గది మారితే... విద్యార్థి ఆలోచన మారుతుంది. విద్యార్థి మారితే... సమాజ భవిష్యత్తే మారుతుంది." కేంద్రం నుంచి రానున్న ఈ భారీ నిధులతో తెలంగాణలోని సర్కారు బడులు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా రూపుదిద్దుకునే అవకాశం లభించింది. మూలమట్టం నుంచి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే, సర్కారు బడుల్లో చేరే పిల్లల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.




మౌలిక సదుపాయాలు లేని పూర్వ విద్యాలయం

**సమగ్ర శిక్ష నిధులపై కోత...**

ఈసారి రూ.230 కోట్లు తక్కువ మంజూరు గత విద్యాసంవత్సరం (202425)తో పోలిస్తే ఈసారి 'సమగ్ర శిక్ష' కింద తెలంగాణకు కేంద్ర నిధుల కోత విధించడం విద్యా రంగ నిపుణులు, విశ్లేషకుల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. 202425లో రూ.1,930 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, 202627 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి దాదాపు రూ. 230 కోట్లు తగ్గించి రూ.1,763.7 కోట్లకు పరిమితం చేయడం గమనార్హం. ఒకవైపు మన ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల అవసరం పతాక స్థాయికి చేరిన వేళ.. ఇలా నిధుల కోత పడటం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ కేటాయింపుల తగ్గింపు వెనుక గల సాంకేతిక కారణాలేంటి, గత నిధుల వినియోగంలో ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా లేదా ఇతర ప్రాధాన్యతలలో మార్పుల వల్ల జరిగిందా అనే కోణంలో విద్యాశాఖ అంతర్గత విశ్లేషణలో మునిగిపోయింది.

**భవిష్యత్తు కార్యాచరణ**

ఈ భారీ నిధులను క్షేత్రస్థాయికి సమర్థవంతంగా చేర్చి, ప్రతి పైసా సద్వినియోగమయ్యేలా చూడటమే ఇప్పుడు అధికారుల ముందున్న ప్రధాన లక్ష్యం. రాబోయే విద్యా సంవత్సరంలో తెలంగాణలోని బడులు కొత్త శోభను సంతరించుకోనున్నాయి.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.- సీఐటీయూ





కాప్రా /ఆగష్టు 10( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సి.ఐ.టి.యు మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జైలు భరో కార్యక్రమమును సి.ఐ.టి.యు కమలానగర్ ఆఫీసు నుండి ఈ సెల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఈసీఐఎల్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పద్మశ్రీ, సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి. సత్యం గారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దేశ సంపదను దోచిపెడుతుందని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడెలను తీసుకొని వచ్చి కార్మికులను కట్టు బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నది అని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమును రద్దుచేసి విబిజి రాంజీ అనే పథకంతో గ్రామీణ పేదల పుట్టగొట్టే దానికి ప్రయత్నం చేస్తున్నది అన్నారు. నూతన విత్తన విధానాన్ని తీసుకొని వచ్చింది అదేవిధంగా నూతన విద్యుత్ విధానము నూతన విద్యా విధానము తీసుకుని వచ్చి ప్రజల పైన అనేక భారాలు వేసి దానికి ప్రయత్నం చేస్తున్నది అని అన్నారు. అమెరికాతో చేసుకున్న నూతన వాణిజ్య ఒప్పందంతో భారతదేశంలోని రైతులకు మెడకు ఉరి తాళ్లు బిగించినట్లు అవుతుందని అన్నారు. నూతన విద్యుత్ విధానం వలన రైతులకు ఎస్సీ, ఎస్టీల పేద ప్రజలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ స్కీము నుంచి వారిని తొలగించి వారిపైన భారాలు వేసేదానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి విధానాలకు పరోక్షంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని అన్నారు. నూతన లేబర్ కోడలను తెలంగాణ ప్రభుత్వం కూడా అమలు చేసే దానికి ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. కేరళలో ఉన్న గత వామపక్ష ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లను అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేసిన ఏకైక వామపక్ష ప్రభుత్వం కేరళ అని అన్నారు. 1942 ఆగస్టు 9న భారతదేశానికి స్వాతంత్రం కావాలని ఏదైతే క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందో హానీస్ఫూర్తితో ఈరోజు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈరోజు జరిగిన దేశవ్యాప్తంగా జిల్ బరో కార్యక్రమం విజయవంతమైందని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కార్యశక ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు జి శ్రీనివాసులు జిల్లా కోశాధికారి పి గణేష్ జిల్లా కమిటీ సభ్యులు మణికంఠ,ఐద్వ జిల్లా అధ్యక్షురాలు సృజన తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్ కే ఉన్నికృష్ణ కే శోభారాణి, రేవతి కళ్యాణి,రమేష్ నాయకులు, చింతల యాదయ్య,సబిత లక్ష్మణ్, వెంకన్న,టి.రవీందర్ రెడ్డి,టీ. నరసింహ, కే బాలరాజు, సంతోష్, ఆదామ్, పి.శ్రీనివాస్, నర్సింగరావు, రాంబాబు, శ్రీమన్నారాయణ, శివన్నారాయణ, జయరాజు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు రహిత ప్రాంతంగా కర్రెగుట్టలు

**- డీజీపీ సీవీ ఆనంద్**

**- పామునూరు బేస్ క్యాంపును సందర్శన**

**- కర్రెగుట్టల్లో శాంతికి ప్రతీకగా పావురాలను ఎగురవేశారు**







వెంకటాపురం-నూగూరు, ఆగస్టు 10, (విజన్ ఆంధ్ర): కర్రెగుట్టల ప్రాంతాన్ని మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ సర్కిల్ పరిధిలోని పాముసూరు సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపును ఆయన సందర్శించారు. పాముసూరు నుంచి ఛత్తీస్ గఢ్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం కర్రెగుట్టల్లో పోలీస్ జెండాను ఎగురవేసి, శాంతికి ప్రతీకగా పావురాలను ఎగురవేశారు.

**-అభివృద్ధికి కొత్త బాటలు**

సుమారు 50-60 ఏళ్లుగా మావోయిస్టు ప్రాబల్య ప్రాంతంగా ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేత అనంతరం ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొందని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. పాముసూరు బేస్ క్యాంపు నుంచి ఛత్తీస్గఢ్ వరకు రహదారి నిర్మాణ పనులు మంజూరయ్యాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్లో ఈ ప్రాంతాన్ని ప్రజా రవాణాకు అనుకూలంగా తీర్చిదిద్దడంతోపాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పూర్తయిన రహదారి చివరి భాగం వరకు వెళ్లి పనులను ఆయన పరిశీలించారు.

**-ఆదివాసులకు అండగా ప్రభుత్వం**

పాముసూరులో నివసిస్తున్న గ్రామస్తులకు డీజీపీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఆదివాసీ గ్రామాల ప్రజలకు పోలీసు శాఖ తరఫున పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇంకా మావోయిస్టు కార్యకలాపాల్లో ఉన్న వారు ఎక్కడ ఉన్నా పోలీసుల ఎదుట లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున పునరావాసం, అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ, ఐజీ, ములుగు జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్, అటవీ శాఖ ఉన్నతాధికారులు, సీఆర్పీఎఫ్ అధికారులు, జిల్లా పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో డీజీపీ వివిధ అంశాలపై మాట్లాడారు.

## తీజ్ వేడుకల్లో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి








కాప్రా /ఆగష్టు 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : చర్లపల్లి డివిజన్ పరిధిలోని మారుతి కాలనీ చక్రిపురం ప్రాంతంలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువత నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే గారు ఉత్సాహంగా పాల్గొని వారితో కలిసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే ఇలాంటి పండుగలను ప్రతి ఒక్కరూ ఐక్యత, సోదరభావంతో నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తీజ్ పండుగ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నేమూరి మహేష్ గౌడ్ , మహేందర్, శ్రీశైలం, ప్రసాద్ రెడ్డి, సుధాకర్, శ్రీను, వెంకటేష్, శ్రీకాంత్, రవి. బి ఆర్. ఎస్ పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# పాలమూరు-రంగారెడ్డి కలకు కేంద్రం బ్రేక్

**డీపీఆర్ తిరస్కరించిన ఢిల్లీ - జాతీయ హోదా ప్రతిపాదనే లేదు**

- **టెక్నో ఎకనామిక్ అప్రైజల్ కూడా వద్దంది..**
- **సమగ్ర ప్రణాళికతో రావాలన్న సూచన..**



**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 10:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేంద్రం నుండి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ప్రాజెక్టు వివరాల నివేదికను పూర్తిగా తిరస్కరించి తిరిగి పంపేసింది. అంతేకాదు ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలన్న ప్రతిపాదనే తమ పరిశీలనలో లేదని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ అప్రైజల్ ను కూడా ప్రస్తుతం చేపట్టలేమని తేల్చి చెప్పింది. తెలంగాణ ప్రభుత్వం పంపిన్రా=ూ×ూ డీపీఆర్ లో అనేక లోపాలు ఉన్నాయని, సమగ్ర ప్రణాళికతో అన్ని అంశాలను కవర్ చేస్తూ మళ్లీ ప్రతిపాదన పంపాలని కేంద్రం సూచించింది. ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక సాయం ఇచ్చే విషయంలోనూ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ఈ నిర్ణయంతో పాలమూరు, రంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 9.32 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న రైతుల కలకు గండి పడింది. ఏళ్లుగా వర్షాధారంగా బతుకుతున్న రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. తాగునీటి సమస్య కూడా పరిష్కారం కాకుండా ఆగిపోయింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం మళ్లీ కొత్త డీపీఆర్ తయారు చేయాల్సి ఉంటుంది. కేంద్రం నుండి మళ్లీ అనుమతుల కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. దీంతో ప్రాజెక్టు పనులు మరింత వాయిదా పడే అవకాశం ఉంది. కేంద్రం తన లేఖలో “సమగ్ర ప్రణాళిక లేకుండా డీపీఆర్ ఆమోదించడం సాధ్యం కాదు“ అని స్పష్టం చేసింది. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఒక రైతు ఆవేదన వ్యక్తం చేస్తూ “20 ఏళ్లుగా ఈ ప్రాజెక్టు కోసం ఎదురుచూస్తున్నాం. ప్రతిసారి ఆశ పెట్టి ఇలాగే నిరాశపరుస్తున్నారు. మా పొలాలు ఎప్పుడు పచ్చబడతాయి“ అని ప్రశ్నించారు.

# వార్డు హీరోకు సన్మానం

**పరిశుభ్రత కార్మికుడికి మొదటి నెల జీతం బహుమతి**

- కల్వకుర్తి 15వ వార్డు కౌన్సిలర్ కుడుముల అస్మిత చంద్రకాంత్ రెడ్డి ఆదర్శ చర్య..





ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 10: ఎండనక వాననక, రోడ్లపై చెత్తను ఎత్తి మన వార్డును పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు జోగు లక్ష్మయ్య సేవలను కల్వకుర్తి మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ కుడుముల అస్మిత చంద్రకాంత్ రెడ్డి గుర్తించారు. లక్ష్మయ్య నిస్వార్థ సేవకు అభినందనగా తన మొదటి నెల జీతాన్ని సన్మాన కానుకగా అందజేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కుడుముల అస్మిత చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ “పారిశుద్ధ్య కార్మికులే మన ఆరోగ్యానికి అసలైన వీరులు. సమాజంలో వారి స్థానం చాలా గొప్పది. ఇలాంటి సేవలను ప్రతి ఒక్కరం గుర్తించి గౌరవించాలి“ అని అన్నారు. లక్ష్మయ్య కష్టాన్ని చూసి కదిలిన కౌన్సిలర్ చేసిన ఈ చర్య 15వ వార్డులోనే కాదు, మొత్తం కల్వకుర్తి మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది. ఇతర కార్మికులకు కూడా ఇది పెద్ద ప్రోత్సాహంగా నిలిచింది. స్థానికులు కూడా ఈ సన్మానాన్ని స్వాగతిస్తూ “కుడుముల అస్మిత చంద్రకాంత్ రెడ్డి లాంటి ప్రజాప్రతినిధులు ఉండటం మా అదృష్టం“ అని కొనియాడారు.

## మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల లో ఉప్పల్ విద్యార్థులకు ఫీజు రాయితీపై మేడ్చల్ ఎమ్మెల్యేతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమావేశం




కాప్రా / ఆగష్టు 10 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజు రాయితీ కల్పించే అంశంపై ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రివర్యులు మేడ్చల్ ఎమ్మెల్యే చామకుర మల్లారెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించి, వారు ఉన్నత విద్యను కొనసాగించేలా సహకరించాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఉప్పల్ నియోజకవర్గ విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# “వలసల నుండి విప్లవం వరకు... తెలంగాణ యువత 30 ఏళ్ల గాథ“

- ఫీజు రియంబర్స్‌మెంట్ ఇచ్చిన రెక్కలు...
- టి-హబ్ చూపిన దారి...
- ఇప్పుడు లక్ష్యం ప్రతి జిల్లాలో ఐటి...





**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర,ఆగస్ట్ 10:** ఒకప్పుడు ఇంజనీరింగ్ సీటు అంటే లక్షల ఫీజు. డిగ్రీ పూర్తి చేసినా చేతిలో ఉద్యోగం ఉండేది కాదు. దిక్కుతోచక బెంగళూరు, చెన్నై, ముంబై, ఢిల్లీలకు బస్సులు ఎక్కేవారు. తల్లిదండ్రులు కలలు కనేవారు... పిల్లలు అమెరికా వెళ్తేనే బతుకు బాగుపడుతుందని.

***ఆ చీకట్లో తొలి వెలుగు హైటెక్ సిటీ***

అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైదరాబాద్ ను ఐటి మ్యాప్ లో పెట్టారు. కానీ అది కొద్ది మంది కార్పొరేట్ ఉద్యోగులకే పరిమితమైంది.

***గేమ్ చేంజర్ - ఫీజు రియంబర్స్‌మెంట్***

2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఫీజు రియంబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారు. ఆ ఒక్క నిర్ణయం లక్షలాది పేద ఇళ్ల తలుపులు తెరిచింది. పల్లెలోని రైతు బిడ్డ కూడా “నేను ఇంజనీర్ అవుతా“ అని చెప్పే ధైర్యం వచ్చింది. ఫలితంగా రాష్ట్రమంతా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టాయి. లక్షల మంది యువతకు డిగ్రీ అంది.

***ఉద్యోగాల విప్లవం - టి-హబ్ యుగం***

తెలంగాణ వచ్చాక కేసీఆర్ కొత్త ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు పెట్టి విద్యను మరింత విస్తరించారు. కేటీఆర్ ఐటి శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకొని టి-హబ్, టి-వర్క్స్, టి-ఫైబర్ తో హైదరాబాద్ ను గ్లోబల్ ఐటి డెస్టినేషన్ గా మార్చారు. మైక్రోసాఫ్ట్ నుండి అమెజాన్ వరకు దిగ్గజ కంపెనీలు వచ్చాయి. ఫలితం? లక్షల మంది యువతకు హైదరాబాద్ లోనే లక్షల జీతాల ఉద్యోగాలు.

వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ లలో కూడా ఐటి పార్కులు పెట్టాలన్న ఆలోచన ఉండేది. కానీ అది సగంలోనే ఆగిపోయింది.

***2026 డిమాండ్:***

“మాకు హైదరాబాద్ వద్దు... మా ఊరే కావాలి“ ఈరోజు హైదరాబాద్ ట్రాఫిక్, అద్దెలు, రద్దీతో నిండిపోయింది. గ్రామీణ యువత ఒకటే కోరుకుంటోంది. లి“చదువు మా జిల్లాలో, ఉద్యోగం మా జిల్లాలో“.

ప్రస్తుత ప్రభుత్వం మరిన్ని ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో ఐటి పార్కులు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు చేస్తే... వలసలు ఆగుతాయి. గ్రామాలు బతుకుతాయి. తెలంగాణ నిజమైన అభివృద్ధి సాధిస్తుంది.

***యువత మాటల్లో..***

“మాకు సీటు ఇచ్చారు, ఉద్యోగం ఇచ్చారు. ఇప్పుడు మా ఊరికి అవకాశం ఇవ్వండి“




# భక్తి శ్రద్ధలతో ముగిసిన ఆషాడ మాస బోనాలు..

- లక్షలాది మహిళల బోనాలతో పొంగిన అమ్మవారి ఆలయాలు
- పలారం బండ్లు, డప్పుల చప్పుడుతో మారుమోగిన వీధులు



బోనాల వేడుకలో పాల్గొన్న ఏసీపీ, సీఐ....

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 10:** తెలంగాణ సంస్కృతికి, భక్తికి ప్రతీక అయిన ఆషాడ మాస బోనాల జాతర భక్తి శ్రద్ధలతో ఘనంగా ముగిసింది. నెల రోజుల పాటు కొనసాగిన ఈ ఉత్సవాల్లో లక్షలాది మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆషాడం చివరి ఆదివారంతో బోనాలకు పూర్ణాహుతి పలికింది. ఉదయం నుంచే మహిళలు కొత్త చీరలు ధరించి, తలపై బోనం బుట్టలు పెట్టుకుని “అమ్మా తల్లీ“ అంటూ ఆలయాలకు తరలివచ్చారు. పసుపు, కుంకుమ, వేపాకులు, బెల్లం అన్నంతో నింపిన బోనాలను భక్తితో అమ్మవారికి సమర్పించారు.

**పలారం బండ్లతో సందడి**

ఆలయాల ముందు నుంచి లిపలారం బండ్లులి ఊరేగింపుగా బయలుదేరాయి. రంగురంగుల పూలతో, దీపాలతో అలంకరించిన బండ్లపై అమ్మవారి విగ్రహాలను ఉంచి, డప్పుల చప్పుడు, పోతురాజుల నృత్యాలతో వాతావరణం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. యువకులు “బోనాల పండుగ“ అంటూ డప్పు వాయిద్యాలతో కేరింతలు కొట్టారు. వృద్ధులు, చిన్నారులు సైతం ఈ ఊరేగింపులో పాల్గొని అమ్మ అనుగ్రహం కోసం ప్రార్థించారు. వీధులన్నీ పసుపు, కుంకుమ జల్లులతో కళకళలాడాయి.

**ఎల్బీనగర్ బడంగ్‌పేట్‌లో ప్రత్యేక పూజలు..**

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ ప్రాంతంలో కూడా బోనాల వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఇక్కడ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ వేడుకల్లో ఎల్బీనగర్ షీ టీం, ఏసీపీ వెంకటేశ్వర్లు, లక్డీకపూల్ సీఐడి సీఐ నాగార్జున స్థానిక జ్యోతి గణేష్ గౌడ్ నిర్వహించిన బోనాల వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, భక్తులకు బోనాలు పంపిణీ చేశారు. మహిళలతో కలిసి పలారం బండ్లను లాగడం విశేషంగా నిలిచింది.

**మహిళలే కేంద్రంగా**

ఈ జాతరలో మహిళలదే ప్రధాన పాత్ర. ఉద్యోగాలు, ఇతర పనులు పక్కన పెట్టి నెల రోజుల పాటు అమ్మవారి సేవలో తరించారు. “అమ్మకు బోనం పెడితే ఇంట్లో సుఖసంతోషాలు ఉంటాయని“ భక్తులు దృఢంగా నమ్ముతారు. చాలా మంది మహిళలు “ఇంట్లో అనారోగ్యం తగ్గాలని“, “పంటలు బాగా పండాలని“, “పిల్లలకు ఉద్యోగాలు రావాలని“ మొక్కులు మొక్కి బోనాలు సమర్పించారు.

**భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం**

బోనాల జాతరను పురస్కరించుకుని పోలీసులు, మున్సిపల్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తాగునీరు, మెడికల్ క్యాంపులు, ప్రత్యేక బస్సులు నడిపారు. షీ టీం మహిళల భద్రత కోసం ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించింది.



**పూర్ణాహుతితో ముగింపు**

చివరి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రాత్రి జరిగిన పలారం బండ్ల ఊరేగింపు ఆకట్టుకుంది. అమ్మ వారి నామస్మరణలతో, టపాసుల వెలుగులతో బోనాల జాతరకు ఘనంగా ముగింపు పలికారు. ఆషాడం వెళ్లిపోయినా... అమ్మ అనుగ్రహం మాత్రం ప్రతి ఇంట్లో నిలిచింది అని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## నల్ల పోచమ్మ ఆలయంలో అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు

- **ముఖ్యఅతిథిగా శివ నరసింహ శాస్త్రి.. అమ్మవారికి ప్రత్యేక పూజలు**
- **భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన భక్తులు**
- **ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకల నిర్వహణ**



కాప్రా /ఆగస్టు 9(విజన్ ఆంధ్ర ప్రతినిధి ): నాచారం ఇంద్రానగర్ లోని నల్ల పోచమ్మ దేవాలయంలో బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన శివ నరసింహ శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు జి. చంద్రశేఖర్, కె. అశోక్, జి. విజయలక్ష్మి, కె. సత్యనారాయణ, అధ్యక్షులు బి. చంద్ర మౌళి, ప్రధాన కార్యదర్శి పి. రమేష్ కుమార్, కోశాధికారి బి. బాలయ్య, ఉపాధ్యక్షులు జి. రాజి రెడ్డి, కె. అశోక్, ఆర్. శ్రీశైలం, పి. సురేందర్ స్వామి, ఆర్. శ్రీధర్, కె. నిఖిల్ సాయి పాల్గొన్నారు. సంయుక్త కార్యదర్శులు ఎం. ఉమామహేశ్వర చారి, జి. శేఖర్ గుప్తా, టి. రాకేష్, ఎ. అంజయ్య, కె. విజయ్ కుమార్, వి. సాయి కుమార్, పి. ఇంద్రసేన రెడ్డి, కె. యాదగిరి, నిర్వాహకులు డి. కాళిదాస్, ఎ. శ్యామ్ కుమార్, ఈ. శ్రీను నాయక్, జి. బాలసిద్ధులు, పి. రవి కుమార్, పి. రాములు, కె. రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే సభ్యులు పి. ప్రభాకర్, ఆర్. బాలమల్లు, కె. వెంకటేష్, కె. సత్యనారాయణ యాదవ్, కె. శ్రీనివాస్, డి. రాంప్రసాద్, ఆర్. కృష్ణ, జి. శ్రీనివాస్, జె. ప్రభాకర్, ఎం. రవి, ఎ. సుధాకర్, జి. శ్రీనివాస్ (జన), జి. శివ, జి. రమేష్, కె. రవి చారి, వి. గోపాల్, చి. మహేష్, ఎ. ఉప్పలయ్య తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## పోలీస్ వ్యవస్థ ఆధునికీకరణ శాంతిభద్రతలు, ఎదురవుతున్న సవాళ్లు



హైదరాబాద్ /ఆగష్టు 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కాన్ఫరెన్స్ హాల్లో లక్ష్యం సొసైటీ చైర్మన్, మాజీ ఎం.ఎల్ సి.కపిలవాయి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ వ్యవస్థ ఆధునికీకరణ శాంతిభద్రతలు, ఎదురవుతున్న సవాళు ్ల అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఐ. పి.ఎస్ , జమ్మూ కశ్మీర్ మాజీ డీ. జి. పి. రాజేంద్ర కుమార్ ఐ.పి. ఎస్,తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు సీనియర్ పోలీసు అధికారులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. సుదీర్ రాజ్ పాల్ ఐ.పి.ఎస్ (హర్యానా) సంజయ్ కందు ఐ. పి.ఎస్. (హిమాచల్ ప్రదేశ్) ఎం.డి. షకీల్ అక్తర్ ఐ.పి.ఎస్ (తమిళనాడు) అరుణ బహుగుణ ఐ.పి.ఎస్ కోడె దుర్గాప్రసాద్ ఐ.పి.ఎస్ కోపినాథ్ రెడ్డి ఐ.పి.ఎస్ కె. పద్మనాభయ్య ఐ.ఏ .ఎస్. నల్లా రాధాకృష్ణ జాతీయ అధ్యక్షులు, బహుజన సాహిత్య అకాడమీ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED, AND OWNED BY J. NARENDER. PRINTED AT: SREE SESHASAI ENTERPRISES, 3-88, CHANDRA THEATRE MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151 AT J.N. PUBLICATION, 76-6-01, BHATSING ROAD, CHAITANYA APTS, NEAR SWATHI CENTER, BHAVANIPURAM, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH – 521137. RNI NO.: APTEL/26/A0313 EDITOR: J. NARENDER CELL NO.: 9440897445 EMAIL: visionandhra1999@gmail.com